**అఖిలేశ్ యాదవ్ ఫేస్‌బుక్ అకౌంట్ సస్పెండ్**

న్యూఢిల్లీ: సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఫేస్‌బుక్ అకౌంట్‌ను సస్పెండ్ చేశారు. దీంతో ఆ పార్టీ తీవ్ర విమర్శలు చేసింది. అఖిలేశ్ యాదవ్ ఫేస్‌బుక్ అకౌంట్‌కు 80 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఆ పేజీ ఆఫ్‌లైన్‌లోకి వెళ్లింది. యూపీ మాజీ సీఎం అఖిలేశ్.. ఎక్కువగా తన ఫేస్‌బుక్ పేజీలో రాజకీయ అభిప్రాయాలను వెల్లడిస్తారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఆయన ఎఫ్‌బీలో రాసేవారు. ఆ అకౌంట్ ద్వారా ఆయన తన మద్దతుదారులతో నిత్యం టచ్‌లో ఉండేవారు. ఫేస్‌బుక్ అకౌంట్ సస్పెండ్ అయిన అంశంపై ఎస్పీ ప్రతినిధి ఫక్రుల్ హసన్ చాంద్ స్పందించారు. ప్రజా వ్యతిరేకతను అణిచివేసేందుకు బీజేపీ సర్కారు ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. సోషల్ మీడియా ఎక్స్‌లో ఆయన పోస్టు చేశారు. దేశంలోనే అతిపెద్ద మూడవ పార్టీ సమాజ్‌వాదీ పార్టీ అని, ఆ పార్టీకి చెందిన పేజీని సస్పెండ్ చేయడమంటే, ఇది నేరుగా ప్రజాస్వామ్యంపై దాడి అన్నారు. బీజేపీ అప్రకటిత ఎమర్జెన్సీ అమలు చేస్తోందన్నారు. ప్రతిపక్ష స్వరాన్ని నొక్కిపెడుతోందన్నారు.


# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :197 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 12-10-2025 | పేజీలు:4 వెల: 2.00


## తెలంగాణలో మహిళలకు ఉచిత చీరలపై మంత్రి తుమ్మల కీలక ప్రకటన...



హైదరాబాద్,తెలంగాణలో ఇందిరా మహిళాశక్తి పథకం కింద స్వయం సహాయ సంఘాల మహిళలకు ఉచిత చీరలు అందించే పథకంపై ప్రభుత్వం నుంచి కీలక అప్‌డేట్ వెలువడింది. రాష్ట్రంలోని 65 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు నవంబర్ 15 నాటికి ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీకి సిద్దం చేయాలని వ్యవసాయ, చేనేత, జౌళీశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం రోజున రాష్ట్ర సచివాలయంలో చేనేత, జౌళిశాఖపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జౌళీ శాఖ కమిషనర్ శైలజా రామయ్యర్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ... గతంలో (బీఆర్ఎస్ హయాంలో చీలర పంపిణీ) నాణ్యత విషయంలో విమర్శలు నేపథ్యంలో, చేనేత కార్మికులతో ప్రత్యేకంగా నాణ్యతతో కూడిన చీరలను ఉత్పత్తి చేయిస్తున్నట్టుగా తెలిపారు.మహిళల కోసం 6.5 మీటర్ల చీరలు, వృద్ధుల కోసం తొమ్మిది మీటర్ల చీరలు రూపొందించామన్నారు. చీరల తయారీలో దాదాపు 6,500 మంది నేత కార్మికులకు ఆరు నుంచి ఎనిమిది నెలల పాటు ఉపాధి లభించిందని తెలిపారు. అలాగే చేనేత రంగానికి ప్రోత్సహం లభించిందని చెప్పారు. రాష్ట్రంలో మొత్తం 64.69 లక్షల చీరలను సిద్దం చేయాలని చెప్పారు. ఇప్పటికే 33.35 లక్షల చీరలను ఉత్పత్తి చేసి జిల్లా గోదాములకు పంపించామని... వచ్చే నెల 15 నాటికి మిగిలినవి కూడా పూర్తి చేసి గోదాములకు తరలించి పంపిణీకి సిద్ధం చేయాలని ఆదేశించారు.ఈ సమీక్ష సందర్భంగా రుణమాఫీకి అర్హులైన చేనేత కార్మికుల ఎంపిక ప్రక్రియ వెంటనే పూర్తి చేసి వారి ఖాతాల్లో నిధులను జమ చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. నేతన్న భరోసా పథకం కింద ఈ ఏడాది రూ. 48.80 కోట్లు కేటాయించామని చెప్పారు. ఈ పథకంలో చేనేత కార్మికులకు రూ. 18 వేలు, అనుబంధ కార్మికులకు రూ. 6 వేలు చొప్పున ఏడాదికి రెండు విడతల్లో ప్రోత్సాహకం అందిస్తామని తుమ్మల వెల్లడించారు. వచ్చే ఏడాది నుంచి అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, సంస్థలు చేసే వస్త్రాలు కొనుగోళ్లకు సంబంధించి ఆర్డర్లు టెస్కో నుంచే తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో తాత్కాలికంగా నడుపుతున్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీని యాద్రాద్రి భువనగిరి జిల్లాలోని పోచంపల్లికి తరలించే ప్రక్రియ ప్రారంభించాలని చెప్పారు.

ఇందిరా మహిళా శక్తి కింద చీరల పంపిణీ...

తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి బతుకమ్మకు తెల్ల రేషన్ కార్డులు కలిగిన కుటుంబాల్లోని మహిళలు చీరలు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. 2017లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2023 వరకు ఈ పథకం కొనసాగింది. అయితే 2023 డిసెంబర్‌లో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం... ఈ పథకాన్ని కొనసాగించలేదు. దీంతో గతేడాది బతుకమ్మ పండుగకు చీరల పంపిణీ జరగలేదు. అయితే సీఎం రేవంత్ రెడ్డి మాత్రం... మహిళా సమాఖ్య సభ్యులకు ఇక నుంచి ప్రతి ఏడాది రెండు చీరలు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పంపిణీ చేసిన చీరల నాణ్యతపై వచ్చిన విమర్శలను, ఆరోపణలను ప్రస్తావించారు.గత బీఆర్ఎస్ నాణ్యతలేని చీరలు ఇచ్చారని, తాము మాత్రం సొంత ఆడపడుచు పండుగపూట ఇంటికి వస్తే ఎలాంటి మంచి చీరను పెడతామో అలాంటి నాణ్యతతో కూడిన చీరలను ఇస్తామని కూడా ప్రకటించారు. "ఇందిరమ్మ చీరలు" పేరుతో ఈ పథకాన్ని అమలు చేయనున్నట్టుగా తెలుస్తోంది. స్వయం సహాయక సంఘాలలోని దాదాపు 65 లక్షల మంది మహిళలకు చీరలను అందించాలని చూస్తోంది. అయితే ఈ ఏడాది బతుకమ్మ పండుగకు ప్రభుత్వం ఈ చీరలను పంపిణీ చేయనుందనే వార్తలు వచ్చాయి. అయితే బతుకమ్మ పండుగకు చీరల పంపిణీ జరగలేదు.

## బనకచర్ల డీపీఆర్ అప్రైజల్‌పై సీఎం రేవంత్ ఎందుకు స్పందించడం లేదు..?

హైదరాబాద్ : బనకచర్ల ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు వ్యతిరేకించడం లేదు..? అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. బనకచర్ల డీపీఆర్ అప్రైజల్‌పై సీఎం రేవంత్ ఎందుకు స్పందించడం లేదని హరీశ్‌రావు నిలదీశారు. బనకచర్ల ప్రాజెక్టుపై హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు.బనకచర్ల ప్రాజెక్ట్ టెక్నో ఎకనమిక్ అప్రైజల్ ప్రాసెస్ కొనసాగిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ లేఖ రాశారు. 20 రోజుల కింద సీఆర్ పాటిల్ ఈ లేఖ రాసినా రేవంత్ రెడ్డి ఇప్పటి వరకు స్పందించలేదు. మన దేశంలో సెంట్రల్ వాటర్ కమిషన్ నిబంధనలు, రాజ్యాంగం పరంగా వరద జలాల మీద డీపీఆర్ అప్రైజల్ జరగదు. కానీ ఏపీ ప్రభుత్వం ఈ వరద జలాల మీద బనకచర్ల డీపీఆర్ అప్రైజల్ సబ్మిట్ చేసింది.. దీనిపై కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తుందని రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి లేఖ రాశారు. మరి రేవంత్ రెడ్డి వరద జలాల మీద డీపీఆర్ అప్రైజల్ సాధ్యం కాదని నిలదీయాలి.. కానీ దీనిపై ఇప్పటి వరకు స్పందించలేదు అని హరీష్ రావు నిలదీశారు.463 టీఎంసీలు నీళ్లు గోదావరి నుండి కృష్ణా నదికి ఆంధ్రప్రదేశ్ మళ్లిస్తుంది.. మేము ఆల్మట్టిలో 112 టీఎంసీలు ఆపుకుంటామని కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. మీరు అనుమతిస్తే మేము కృష్ణా నది నీళ్లు ఆపుకుంటానని చెప్తున్నాడు.. దీని వల్ల తెలంగాణ నష్టపోతుంది. కింద గోదావరి నీళ్లు ఏపీ తీసుకుపోతే.. పైన కృష్ణా నీళ్లు కర్ణాటక తీసుకుపోతే, మన బ్రతుకు ఏం కావాలి అని హరీశ్‌రావు ప్రశ్నించారు.ఏపీ 463 టీఎంసీల నీళు మళ్లిస్తే నేను మీద 112 టీఎంసీలు ఆపుకుంటా అని కర్ణాటక అంటుంది.. నేను 74 టీఎంసీలు ఆపుకుంటా అని మహారాష్ట్ర అంటుంది. 112 టీఎంసీలు కర్ణాటక, 74 టీఎంసీలు మహారాష్ట్ర ఆపితే మన పరిస్థితి ఏంది. మాట్లాడితే




నల్లమల బిడ్డ అంటాడు.. ఆ నల్లమలను అనుకొని పారే కృష్ణా నదిలో ఆ మహబూబ్ నగర్ జిల్లాకు నష్టం జరిగితే ఎందుకు మాట్లాడటం లేదు. నువ్వు నల్లమల పులివా, పిల్లివా, ఎలుకవా.. ఎందుకు మాట్లాడటం లేదు. పులి అయితే మాట్లాడేవాడివి.. పిల్లివి, ఎలుకవు కాబట్టి మాట్లాడటం లేదు అని హరీశ్‌రావు ఘాటుగా విమర్శించారు.కేంద్ర ప్రభుత్వం పోలవరంని జాతీయ ప్రాజెక్ట్‌గా గుర్తించినప్పుడు కుడి కాలువ కెపాసిటీ 11,500 క్యూసెక్కులు. ఇప్పుడు కుడి కాలువ కెపాసిటీని 23,000 క్యూసెక్కులు అని అంతకంత పెంచారు. జాతీయ ప్రాజెక్ట్ అని హోదా ఇచ్చాక కెపాసిటీని పెంచి కాలువ తవ్వుతుంటే బీజేపీ పార్టీ ఎలా అనుమతినిచ్చింది. గతంలో కుడి కాలువ కెపాసిటీని 11,500 నుండి 18,000 పెంచినప్పుడు కేసీఆర్ ప్రభుత్వం ప్రశ్నిస్తే పనులు ఆగిపోయాయి. కానీ ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో కెపాసిటీ 23,000కు పెరిగినా ఎవరు అడ్డుకోలేదు, బిల్లులు రిలీజ్ అయ్యాయని హరీశ్‌రావు తెలిపారు.

## పోస్టుమార్టంపై తొందరెందుకు? ఆవేదన వ్యక్తం చేసిన ఐపీఎస్ ఆఫీసర్ భార్య

చండీఘడ్: హర్యానాకు చెందిన ఐపీఎస్ ఆఫీసర్ వై పూరన్ కుమార్ తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అయితే ఆయన మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించేందుకు హర్యానా పోలీసులు తొందరపడుతున్నట్లు భార్య, ఐఏఎస్ ఆఫీసర్ అమ్నీత్ పీ కుమార్ ఆరోపించారు. తన భర్త పార్థీవ దేహాన్ని అప్పగించడంలో హర్యానా పోలీసులు ఎటువంటి హుందాతనాన్ని ప్రదర్శించలేదని ఆమె ఆరోపించారు.

కుటుంబ సభ్యులు లేకుం డానే తన భర్త పార్థీవదేహాన్ని పోలీసులు పోస్టుమార్టమ్‌కు తీసుకెళ్లినట్లు ఆరోపించా రు.తన భర్త దళిత వర్గానికి చెందిన వ్యక్తి అని, పోస్టు మార్టమ్‌కు అంగీకరిం చానని, పిల్లలు చివరిచూపు చూసే వరకు వేచి ఉండాలని కోరానని, కానీ పో లీసులు ఇవేమీ పట్టించుకోలేదని,కుటుంబసభ్యులు లేకున్నా.. ఆస్పత్రి నుంచి తన భర్త మృతదేహాన్ని తీసుకెళ్లినట్లు అమ్నీత్ కుమార్ ఆరోపించారు. తానొక దళిత వింతతువును అని ఆమె పేర్కొన్నారు. చండీఘడ్ పోలీసుల ఆ ధీనంలోనే అన్నీ ఉన్నాయని, వాళ్లకు నచ్చినట్లు వాళ్లు చేసుకోనివ్వండి, కుటుం బంతో సంబంధం లేకుండా వ్యవహరిస్తున్నారని, ఇప్పటి వరకు మౌనంగా ఉండి మర్యాదగా వ్యవహరించానని, కానీ తన చేతుల్లోంచి పరిస్థితి జారిపోతోం దని, పోస్టుమార్టమ్‌కు తొందరెందుకని, చండీఘడ్ పోలీసుల తమ ప్రవర్తనకు వివరణ ఇవ్వాల్సి



ఉంటుందని ఆమె అన్నారు.సెక్టర్ 16 ఆస్పత్రి నుంచి పీజీఐకి మృదేహాన్ని అప్పగించే సమయంలో కీలక ఆధారాలు ధ్వంసం అయ్యే అవకాశం ఉన్నట్లు ఆమె తెలిపారు. ఆ లోపాలకు చండీఘడ్ పోలీసులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.అయితే కుటుంబం ఓకే చెప్పిన తర్వాతనే పోస్టు మార్టమ్ నిర్వహిస్తామని డీజీపీ సాగర్ ప్రీత్ హూడా తెలిపారు.నాలుగు రోజుల తర్వాత ఐపీఎస్ ఆఫీసర్ పూరన్ కుమార్ కుటుంబం పోస్టు మార్టమ్‌కు అంగీకరించినట్లు తెలిసింది

## జూబ్లీ హిల్స్ పోల్ : బీజేపీ గేమ్ చేంజర్




హైదరాబాద్,తెలంగాణా రాష్ట్రంలో ఇపుడు అందరిలో ఆసక్తిని పెంచుతున్నది జూబ్లీ హిల్స్ పోరు. ఉప ఎన్నిక అనూహ్యంగా వచ్చిపడింది. సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీలు ఏ రకమైన ఎన్నికలను కోరుకోవు. అదే విపక్షంలో ఉన్న పార్టీలు అయితే బస్తీ మే సవాల్ అంటాయి. ఇపుడు ఎన్నిక పెట్టండి ఓడించేస్తామని సవాల్ చేస్తూంటాయి. అయితే తప్పనిసరి ఎన్నికలు కొన్ని వస్తూంటాయి. అలాగే అనూహ్యంగా అనివార్యంగా వచ్చి పడే ఎన్నికలు మరి కొన్ని ఉంటాయి. ఆ విధంగా చూస్తే కనుక జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక అవసరార్థం వచ్చింది అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో వచ్చిన ఎన్నికలు ఇవి.

కాంగ్రెస్ లెక్క ఇదే :

కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నిక ఒక విధంగా అగ్ని పరీక్షగానే చెప్పాలి. ఎందుకంటే అర్బన్ ఏరియాలో అందులోనూ తాము గత మూడు నాలుగు ఎన్నికలూ గెలవని చోట తమది కాని సీటులో ఫైటింగ్ ఇవ్వాల్సి వస్తోంది. నిజంగా ఇది రిస్కీ టాస్క్. అయితే కాంగ్రెస్ చేతిలో అధికారం ఉంది. అంతే కాదు డైనమిక్ సీఎం గా జనంలో గుర్తింపు ఉన్న రేవంత్ రెడ్డి ఉన్నారు. ఇక కాంగ్రెస్ రెండేళ్ళ పాలనలో తమ గ్రాఫ్ అర్బన్ సెక్టార్ లో బాగా పెరిగింది అని భావిస్తోంది. అందుకే తొడగొట్టి మరీ జూబ్లీ హిల్స్ రేసులో నిలుస్తోంది.

సెలెక్షన్ తోనే సక్సెస్ :

ఇక జూబ్లీ హిల్స్ సీటుకి సంబంధించి కాంగ్రెస్ తన అభ్యర్థిని ఎంపిక విషయంలో సకల జాగ్రత్తలు పాటించింది. అక్కడ ఉన్న సామాజిక సమీకరణలను దృష్టిలో పెట్టుకుని మరీ ఎంపిక చేసింది. అలా నవీన్ యాదవ్ కి టికెట్ ఇచ్చింది. లోకల్ కార్డుతో పాటు బీసీ ప్లస్ మైనారిటీల మద్దతు ఏకమొత్తంగా కొల్లగొట్టేందుకు కాంగ్రెస్ పక్కా ప్లాన్ ని రెడీ చేసింది. ఈ దెబ్బతో జూబ్లీ హిల్స్ ని గెలిచి తమది కాని సీట్లో జెండా ఎగరేయాలని ఉబలాటపడుతోంది.

బీఆర్ఎస్ సింపతీ కార్డు :

అదే సమయంలో తన సొంత సీట్లో మరోసారి సత్తా చాటాలని బీఆర్ఎస్ ఆరాటపడుతోంది. రెండు దఫాలుగా జరిగిన ఎన్నికల్లో ఈ సీటు బీఆర్ఎస్ కే దక్కుతూ వస్తోంది. బలమైన అభ్యర్ధిగా ప్రజల మన్నన అందుకున్న ఎమ్మెల్యేగా మాగంటి గోపీనాథ్ ఉన్నారు అదే కుటుంబానికి టికెట్ ఇవ్వడం ద్వారా సానుభూతి తమకు కలసి వస్తుందని కూడా బీఆర్ఎస్ ఆశలు పెట్టుకుంది. అందరి కంటే ముందుగా తన అభ్యర్థిని ప్రకటించడం మహిళకు టికెట్ ఇవ్వడంతో పాటు అర్బన్ ఓటర్లలో తమకు ఉన్న పట్టు అన్నీ కలసి గెలుపు ఖాయమని అనుకుంటోంది.

ఎవరు కొంప కొల్లేరవుతోంది :

ఇక అసలు విషయానికి వస్తే బీజేపీ ఈ ఎన్నికల్లో గెలుస్తుందా అంటే జవాబు చెప్పడం కష్టం. అదే సమయంలో అర్బన్ ఓటింగ్ బీజేపీకి ప్రతీ ఎన్నికలోనూ పెరుగుతోంది. దానికి తోడు మోడీ ఫ్యాక్టర్ కూడా కలసి వస్తోంది. దానికి గతంలో జరిగిన జీహెచ్ ఎం సీ ఎన్నికలు ఒక ఉదాహరణ. బీఆర్ ఎస్ తో సమానంగా అర్బన్ లో బీజేపీ తన సత్తా చాటింది. ఇపుడు అదే ఫార్ములాతో బరిలోకి దిగుతోంది. అయితే బీజేపీ రాజకీయంగా ఎంత దూకుడు చేసినా అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ లను తట్టుకుని రేసులో ముందుకు దూసుకుని పోగలదా అన్నదే చర్చగా ఉంది.

అద్భుతమే జరిగి :

అయితే బీజేపీ మాత్రం తన వ్యూహాలను నమ్ముకుంది. అద్భుతాలు సృష్టిస్తామని అంటోంది. అయితే బీజేపీ జోరు చేస్తే ఓట్ల శాతం గణనీయంగా పెరుగుతుంది కానీ గెలుపు అన్నది కష్టమే అన్న చర్చ ఉంది. మరి బీజేపీ చీల్చే ఓట్లు ఏ పార్టీవి అన్నది మరో చర్చగా ఉంది. అధికార కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ ఎస్ గా ఈ ఉప ఎన్నిక మారితే అచ్చమైన గేమ్ చేంజర్ గా బీజేపీ మారుతుంది అని అంటున్నారు. ఒకవేళ త్రిముఖ పోటీగా టర్న్ తీసుకున్న బీజేపీ కచ్చితంగా ఏదో ఒక పార్టీ కొంప ముంచడం ఖాయమని అంటున్నారు. మరి కమలం కదన కుతూహలం ఏ రాజకీయ పార్టీకి ఎసరు పెడుతుంది అన్నది చర్చ. ఒక వేళ బీజేపీ ధీమా ప్రకారం అద్భుతమే జరిగి గెలిచింది అంటే కనుక ఆ లెక్క వేరే గా ఉంటుంది అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## ముస్లిం జనాభా అసాధారణంగా పెరగడానికి అదే కారణం



న్యూఢిల్లీ,మన దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ముస్లిం జనాభా అసాధారణంగా పెరగడానికి అక్రమ చొరబాట్లే ప్రధాన కారణమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఇది కేవలం రాజకీయ సమస్య మాత్రమే కాదని, దేశ భద్రతకు, ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదంగా పరిణమించిందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. శుక్రవారం 'దైనిక్ జాగరణ్' మాజీ ఎడిటర్ నరేంద్ర మోహన్ స్మారకోపన్యాసంలో షా ప్రసంగించారు.కొన్ని రాష్ట్రాల్లోని జనాభా లెక్కలను ఉటంకిస్తూ అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం అస్సాంలో ముస్లిం జనాభా పదేళ్లలో 29.6 శాతం పెరిగిందని, చొరబాట్లు లేకుండా ఈ స్థాయిలో వృద్ధి అసాధ్యమని అన్నారు. పశ్చిమబెంగాల్‌లోని పలు జిల్లాల్లో ముస్లిం జనాభా వృద్ధి రేటు 40 శాతం వరకు, సరిహద్దు ప్రాంతాల్లో ఏకంగా 70 శాతం వరకు ఉందని తెలిపారు. ఇవన్నీ గతంలో జరిగిన చొరబాట్లకు నిదర్శనమని అన్నారు.కొన్ని రాజకీయ పార్టీలు తమ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చొరబాటుదారులకు ఆశ్రయం కల్పిస్తున్నాయని అమిత్ షా ఆరోపించారు. గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలకు కూడా సరిహద్దులు ఉన్నాయని, మరి అక్కడ నుంచి చొరబాట్లు ఎందుకు జరగడం లేదని ప్రతిపక్షాలను ప్రశ్నించారు. చొరబాట్లను అడ్డుకోవడం కేవలం కేంద్ర ప్రభుత్వం, సరిహద్దు భద్రతా దళాల బాధ్యత మాత్రమే కాదని అన్నారు.దేశ భౌగోళిక పరిస్థితుల కారణంగా అన్ని సరిహద్దు ప్రాంతాల్లో కంచె వేయడం సాధ్యం కాదని, అలాంటి చోట్ల రాష్ట్ర ప్రభుత్వాల సహకారం అత్యంత కీలకమని చెప్పారు. అక్రమంగా దేశంలోకి ప్రవేశించిన వారిని స్థానిక జిల్లా యంత్రాంగం గుర్తించడంలో విఫలమైతే చొరబాట్లను ఎలా ఆపగలమని ప్రశ్నించారు. బంగ్లాదేశ్ నుంచి వస్తున్న చొరబాట్ల కారణంగానే జార?ండ్‌లో ఆదివాసీ జనాభా గణనీయంగా తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

## ఆ బహుమతి నాకు ఇచ్చేయమని అడగలేదు.. నోబెల్ శాంతి దక్కకపోవడంపై ట్రంప్ స్పందన


వాషింగ్టన్: ప్రతిష్టాత్మక నోబెల్ శాంతి బహుమతి దక్కకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా స్పందించారు. ఈ బహుమతి కోసం ట్రంప్ తహతహలాడిన విషయం తెలిసిందే. అయితే, ట్రంప్ 'శాంతి' ఆశలపై నీళ్లు చల్లుతూ 2025 నోబెల్ శాంతి బహుమతి వెనెజువెలా ప్రధాన ప్రతిపక్ష నాయకురాలు, ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్న మరియా కొరీనా మచాడోకు నోబెల్ కమిటీ శుక్రవారం ప్రకటించింది.ఈ నేపథ్యంలో శాంతి బహుమతి దక్కకపోవడంపై ట్రంప్ తాజాగా స్పందించారు. ఈ మేరకు మరియా కొరీనా మచాడోతో ఫోన్‌లో సంభాషించినట్లు తెలిపారు. 'కొరీనా మచాడోతో ఫోన్‌లో మాట్లాడాను. నా గౌరవార్థం దాన్ని స్వీకరించినట్లు ఆమె నాతో చెప్పారు. అలా అని ఆ బహుమతి నాకు ఇచ్చేయమని నేను అడగలేదు. విపత్తు సమయంలో వెనెజువెలాలోని ప్రజలకు ఆమె చాలా సాయం చేశారు. నేను ఆమెకు తోడున్నా. ఇకముందు కూడా ఉంటా' అని వైట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.కాగా, ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి మరియా కొరీనా మచాడోను వరించిన విషయం తెలిసిందే. ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ కోసం విశేషంగా కృషి చేసిన మచాడో వెనెజువెలా ఉక్కు మహిళగా కూడా పేరుపొందారు. టైమ్ మ్యాగజైన్ ప్రచురించిన ప్రపంచంలోని అత్యంత పలుకుబడిగల 100 మంది ప్రముఖుల జాబితాలో కూడా ఆమె చోటు దక్కించుకున్నారు. గత ఏడాది



జరిగిన వెనెజువెలా పార్లమెంట్ ఎన్నికలలో భారీ స్థాయిలో రిగ్గింగ్ జరిగి ప్రస్తుత అధ్యక్షుడు నికొలస్ మదురో గెలుపొందిన తర్వాత 58 ఏళ్ల మచాడో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.ఈ శాంతి బహుమతి దక్కడంపై మరియా కొరీనా స్పందిస్తూ.. 'స్వేచ్ఛ కోసం, ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్న వెనెజువెలా ప్రజలందరికీ ఈ గుర్తింపు గొప్ప ప్రేరణ ఇస్తుంది. లక్ష్యసాధనలో విజయానికి చేరువలో ఉన్నాం. ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశాలు మాకు మిత్రులు. ఈ పురస్కారాన్ని కష్టాల్లో ఉన్న వెనెజువెలా ప్రజలతోపాటు మా పోరాటానికి నిర్మాణాత్మక మద్దతు ఇస్తున్న ట్రంప్‌నకు అంకితం ఇస్తున్నా' అని అన్నారు.

## వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో టీషర్టుల ఉత్పత్తి..

హైదరాబాద్: వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో ఉత్పత్తిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. మొదటి యూనిట్ ఉత్పత్తి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రపంచ మార్కెట్లకు టీషర్టులు ఎగుమతి చేయడం సంతోషంగా ఉందని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో 2023లో కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో ఫ్యాక్టరీలకు శంకుస్థాపన చేశామన్నారు. 11 యంగ్ వన్ కార్పొరేషన్ ఫ్యాక్టరీలకు భూమిపూజ చేశామని గుర్తు చేశారు. 90 శాతం మంది కార్మికులు స్థానిక మహిళలేనని, ఎంపవర్‌మెంట్‌కు ఇది నిజమైన చిహ్నమని వెల్లడించారు. అన్ని యూనిట్లు ప్రారంభమైతే.. వరంగల్ ప్రధాన వస్త్ర కేంద్రంగా మారుతుందని వివరించారు.



## సంపాదకీయం

ఆదివారం 12-10-2025

# శాంతికాముకులు ట్రంప్ లాగా ఉండరు !

ప్రపంచ ప్రజలు ఎవరు కూడా యుద్ధాలను కోరుకోవడం లేదు. ఘర్షణలను ఆహ్వానించడం లేదు. ప్రశాంతంగా బతకాలని కోరుకుంటున్నారు. ఇస్లామిక్ ఉగ్రవాదులు తప్ప మిగతా ప్రపంచమంతా ఇదే కోరుకుంటోంది. ఈ క్రమంలో కేవలం ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి కోసమే ట్రంప్ ప్రయత్నించడం వెర్రితనం తప్ప మరోటి కాదు. వాణిజ్య సుంకాలతో ప్రజలను అస్థిరంలోకి నెట్టిన ట్రంప్ ఎప్పిటికీ శాంతి కాముకుడు కాదు. బలవంతంగా గాజా, హమాస్ మధ్య శాంతి కుదిరినా అది ట్రంప్ ఖాతాలో వేయలేం. తనను తాను శాంతిదూత అని చెప్పుకుంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కేవలం నోబెల్ ప్రైజ్ కోసమే విన్యాసాలు చేస్తున్నారు. యుద్ధాలే కాదు..ఆర్థిక యుద్ధాలు కూడా యుద్ధం కిందకే వస్తాయని ట్రంప్ తెలుసుకోవాలి. భారత్, పాక్ యుద్ధం సహా ఏడు యుద్ధాలు ఆపానని, ఈ ఏడాది తనకు నోబెల్ బహుమతి రావలని, లేదంటే అమెరికాను అవమానించినట్లేనని బెదిరింపులకు దిగుతున్నారు. అమెరికాకు రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మొదటి రోజు నుంచే తనకు పీస్ ప్రైజ్ ఎందుకు దక్కదంటూ, తాను అన్ని విధాల అర్హుడినని ప్రకటిస్తూ వస్తున్నారు. ఈ ఏడాదికి నోబెల్ బహుమతుల ప్రకటన మొదలైన తర్వాత ట్రంప్ మరింత బలంగా డిమాండ్ వినిపించారు. గాజాలో శాంతికి అమెరికా ప్రతిపాదించిన 20 సూత్రాల ప్రణాళికను ఇజ్రాయెల్, హమాస్ అంగీకరించాయని, కాల్పుల విరమణకు సంతకాలు చేసిన తర్వాత నోబెల్ శాంతి బహుమతికి తన పేరు ముందు వరుసలో ఉంటుందని చెప్పారు. పాక్, ఇజ్రాయెల్ వంటి దేశాలు ట్రంప్‌ను శాంతి బహుమతికి నామినేట్ కూడా చేశాయి. అయితే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ బహుమతికి ట్రంప్ అసలు అర్హుడేనా అన్న చర్చ సర్వత్రా జరుగుతున్నది. ఎందుకంటే పాలస్తీనా దురాక్రమణకు ఇజ్రాయెల్‌ను ఎగదోస్తున్నదే అమెరికా కాబట్టి ప్రపంచ ప్రజలకు అనుమానాలు ఉన్నాయి.. ఇక రష్యాపై పోరుకు ఉక్రెయిన్‌కు పెద్ద ఎత్తున ఆయుధాలు సరఫరా చేస్తున్నది కూడా అగ్రరాజ్యమే కావడం గమనార్హం. అదేవిధంగా అఫ్ఘానిస్థాన్‌లో తాము నిర్మించిన ఎయిర్ బేస్‌ను బలవంతంగానైనా ఆక్రమిస్తామని, కెనడా కూడా అమెరికా భూభాగమేనని, దానిని తమ దేశంలో మరో రాష్ట్రంగా గుర్తిస్తామని ట్రంప్ ఇప్పటికే ప్రకటనలు చేశారు. ఇవన్నీ ఒక ఎత్తయితే వాణిజ్య సుంకాలతో ప్రపంచానికి కంటిమీద కునుకు లేకుండా చేశారు. అలాగే వీసాల విషయంలోనూ, గ్రీన్ కార్డుల విషయంలోనూ నానా గడ్డీ కరుస్తున్నారు. అలాంట ప్పుడు ట్రంప్ శాంతిదూత ఎప్పటికీ కాలేడు. అయితే హమాస్, ఇజ్రాయిల్ ఒప్పందం వల్ల శాంతి నెలకొంటే ప్రపంచానికి అంతకన్నా కావాల్సింది ఏమీ లేదు. వేలాదిగా ప్రజలు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం.అందుకే శాంతి ప్రణాళిక అమలుకు హమాస్, ఇజ్రాయిల్ చేసుకున్న ఒప్పందాన్ని భారత్‌సహా పలు ప్రపంచ దేశాలు స్వాగతించాయి. ఇయు, బ్రిటన్, కెనడా, బ్రిటన్, న్యూజిలాండ్, ఇరాన్, ఇటలీ, లెబనాన్, రష్యా, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఫ్రాన్స్ సహా పలు దేశాలు ఈ ఒప్పందాన్ని స్వాగతిం చిన వాటిలో ఉన్నాయి. మారణకాండకు స్వస్తి చెప్పే చొరవను, కార్యాచరణను ఎల్లప్పుడూ స్వాగతిస్తామని ఇరాన్ పేర్కొంది. గాజాలో శాంతి స్థాపనకు ఇదొక విశిష్ట అవకాశమని ఇటలీ ప్రధాని మెలొని వ్యాఖ్యానించారు. శాశ్వత కాల్పుల విరమణ దిశగా ఈ తొలి ఒప్పందం ముందడుగు అని లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్ వ్యాఖ్యానించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ స్పందిస్తూ రాజకీయ పరిష్కారానికి ఈ శాంతి ప్రణాళిక మార్గం వేస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఒప్పందం కుదరడం ఆనందించదగ్గ విషయమే కానీ, ఈ ఒప్పందం అమలు ఎలా వుంటుందో చూడడమే చాలా కీలకమని రష్యా పేర్కొంది. ఈ ప్రయత్నాలకు కచ్చితంగా మద్దతిస్తామని క్రెమ్లిన్ తెలిపింది. తాజా పరిణామాలను సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ స్వాగతిస్తూ న్యాయమైన, సమగ్రమైన శాంతి నెలకొనాలని ఆకాంక్షిస్తున్నామని పేర్కొన్నాయి. ఈ మేరకు సౌదీ, యుఎఇ విదేశాంగ శాఖలు ప్రకటనలు జారీ చేశాయి. కాల్పుల విరమణ ఒప్పందాన్ని స్వాగతిస్తూ ఐక్యరాజ్య సమితి పాలస్తీనా శరణార్థుల సంస్థ, గాజా ప్రజానీకానికి మూడు మాసాలకు సరిపడా ఆహార నిల్వలు తమ వద్ద వున్నాయని తెలిపింది. బందీల విడుదల, గాజా ప్రజలకు మానవతా సాయం పెంపు వంటి చర్యలు ఊరట కలిగిస్తాయని, దీర్ఘకాలిక శాంతికి దోహదపడ తాయని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందం నెతన్యాహూ బలమైన నాయకత్వానికి అద్దం పట్టిందని కొనియాడారు. తన రాజకీయ అవసరాల కోసం, పదవిని కాపాడుకోవడం కోసం చిన్నారులు, మహిళలుసహా 70 వేల మందికిపైగా పాలస్తీనియన్లను బలిగొన్న ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహును ప్రధాని మోడీ ప్రశంసించడం గమనార్హం.ఇక్కడ ఒక విషయాన్ని ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. గాజాలో కాల్పుల విరమణ జరపాలని, తన వద్ద బందీలుగా ఉన్న వారిని హమాస్ తక్షణమే విడుదల చేయాలని, నిరాటంకంగా మానవతా సాయాన్ని అందిం చాలని కోరుతూ ఈ ఏడాది ప్రారంభంలో ప్రతిపాదించిన తీర్మానాన్ని ఐక్యరాజ్యసమితిలో మూడో వంతు సభ్యులు సమర్ధించగా, భారత్ గైర్హాజరైంది. ప్రత్యక్ష చర్చల ద్వారానే శాంతి నెలకొంటుందని అభిప్రాయపడింది. ఇకపోతే ఇజ్రాయిల్, హమాస్ ఆమోదించిన శాంతి ప్రణాళిక తొలి దశలో భాగంగా హమాస్ 20 మంది బందీలను విడుదల చేస్తుంది. చనిపోయిన 27 మంది మృతదేహాలు కూడా అప్పగిస్తుంది. అటు ఇజ్రాయిల్ చెరలో ఉన్న రెండు వేల మంది పాలస్తీనా ఖైదీలు కూడా విడుదలవుతారు. ఇజ్రాయిల్ విడుదల చేయాల్సిన ఖైదీల జాబితాను ఇప్పటికే హమాస్ అందజేసింది. బలమైన, సుస్థిరమైన, దీర్ఘకాలిక శాంతి స్థాపన దిశలో తొలి చర్యగా ఇజ్రాయిల్ గాజా నుండి తన దళాలను ఉపసంహరించుకుంటుందన్నారు. మధ్యవర్తిత్వం నెరపిన ఖతార్, ఈజిప్ట్, టర్కీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తమ ప్రజలకు స్వేచ్ఛ, స్వాతంత్యం÷-ర కల్పించేందుకు కట్టుబడి వున్నామని హమాస్ పునరుద్ఘాటించింది. పాలస్తీనా వాసుల త్యాగాలు వృథా పోవని పేర్కొంది. మధ్యవర్తులకు, ట్రంప్‌నకు కృతజ్ఞతలు తెలిపింది. ఇది ఇజ్రాయిల్‌కు గొప్ప రోజని ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూ వ్యాఖ్యానించారు. ఒప్పందం కుదరడంలో కీలక పాత్ర పోషించిన ట్రంప్‌నకు ధన్యవాదాలు తెలిపారు. గాజాలో శాంతి ఒప్పందం కుదిర్చేందుకు అమెరికా, ఖతార్, ఈజిప్ట్, టర్కీ దేశాల మధ్యవర్తిత్వ ప్రయత్నాలను ఐక్యరాజ్య సమితి (యుఎన్ఒ) ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ కొనియాడారు. ఒప్పందాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు ఐక్యరాజ్య సమితి మద్దతు ఇస్తుందని, మానవతా సాయాన్ని పర్యవేక్షిస్తుందని ఆయన తెలిపారు. మొత్తంగా గాజాలో శాంతిని అందరూ కోరుకుంటున్నారు. గాజాను అడ్డం పెట్టుకుని ట్రంప్ మాత్రం నోబెల్ బహుమతి కోరుకుంటున్నారు.

# మృతిచెందిన నిరసనకారుల తల,మొండెం భాగంలో తూటాలు..



లద్దాఖ్:లద్దాఖ్‌లో చెలరేగిన హింసకు సంబంధించి విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. హింసలో చనిపోయిన నలుగురిలో ముగ్గురు ఇరవై సంవత్సరాల వయసు పైబడిన వారున్నారు. వారి మొండెం, తలలో చాలా తూటాల గాయాలున్నాయి.లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతానికి రాష్ట్ర హోదా కల్పించి, ఆరవ షెడ్యూల్ కింద భద్రతను విస్తరించాలనే తమ డిమాండ్లపై ఒత్తిడి పెంచడానికి యువజన, విద్యార్థి సంఘాలు నడుంబిగించాయి. సెప్టెంబర్ 24న బుధవారంనాడు బంద్(షెట్‌డౌన్)కు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగా బంద్ రోజు లేహ్‌లో నిరసన చేస్తున్న యువతను చెదరగట్టడానికి పోలీసులు ప్రయత్నించారు. ఇది కాస్తా హింసకు దారితీసింది. ఈ హింసలో నలుగురు చనిపోయారు.రాష్ట్రహోదా కోసం జరిగిన నిరసనలో పాల్గొనడానికి లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతం నలుమూలల నుంచి పలువురు విద్యార్థులు, యువకులు సెప్టెంబర్ 24న లేహ్‌కు చేరుకున్నారు. అందులో రాజధానికి 160 కిలో మీటర్ల దూరంలో ఉన్న హను గ్రామ నివాసి ఒకరు ఉన్నారు. మరొకరు 200 కిలోమీటర్ల దూరంలోని స్కుర్ బుచన్‌కు చెందిన వ్యక్తి, మిగితా ఇద్దరు ఇగూ గ్రామం ఖర్నాక్లింగ్ నివాసులున్నారు. ఖర్నాక్లింగ్ రాజధానికి సమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. వీరిలో ముగ్గురు 20 సంవత్సరాలు దాటిన వారుండగా-అందులో ఒకరు మాజీ సైనికుడు, మిగితా ఇద్దరు లేహ్‌లో ఉద్యోగాలు చేస్తున్నారు.నిరసన సందర్భంగా లేహ్‌లో చెలరేగిన హింసలో అనేక తూటా గాయాలతో మరణించారని విశ్వసనీయ సమాచారవర్గాలు తెలిపినట్టుగా ఇండియన్ ఎక్స్ప్రెస్ తెలియజేసింది.మరణించిన వారిలో ఖర్నాక్లింగ్‌కు చెందిన జిగ్మెట్ డోర్జాయ్(25), ఇగూ గ్రామం నుంచి స్టాన్జిన్ నంగ్యాల్(23) హనూ నుంచి రించెన్ దాదుల్(20), స్కుర్ బుచన్ ప్రాంతానికి చెందిన త్సేవాంగ్ థార్చిన్(46)గా గుర్తించారు.మాజీ సైనికుడైన థార్చిన్ ప్రస్తుతం లేహ్‌లో చదువుకుంటున్నాడని, చనిపోయే కొన్నిరోజుల ముందే ట్రావెల్ ఏజెన్సీ ఉద్యోగంలో చేరాడని థార్చిన్ కుటుంబసభ్యుడైన నామ్‌గ్యాల్ చెప్పాడు.“అతడు మంచి పిల్లాడు, ఇంతకు మించి మేము ఏమీ చెప్పలేము. సహృదయంతో అర్థం చేసుకోండి. మేము మీడియాతో మాట్లాడకూడదని ఆదేశాలు ఉన్నాయి”అని నామ్‌గ్యాల్ అన్నారు.లేహ్ అధికారులు నోరువిప్పకపోవడంతో, మరణించిన వారితో సహా ఇతర బాధిత కుటుంబసభ్యులను సంప్రదించలేకపోతున్నట్టుగా సమాచార వర్గాలు తెలియజేశాయి. ఏదిఏమైనప్పటికీ, మృతదేహాలను వారి కటుంబ సభ్యులకు సెప్టెంబర్ 25న అందజేశారు.సెప్టెంబర్ 24 మధ్యాహ్నం, లేహ్‌లోని ఎస్ఎన్ఎం ఆసుపత్రికి 50 మందికి పైగా క్షతగాత్రులను తీసుకుచ్చారు. ఆసుపత్రికి తరలించే సమయంలో ఇద్దరు బాధితులు ప్రాణాలతోనే ఉన్నారు. కానీ తగిలిన గాయాల వల్ల ఆ తర్వాత వారు చనిపోయారు. వారి మొండెం, తల భాగంలో అనేక తూటా గాయాలున్నాయి. తుపాకి కాల్పుల్లో మరో అరడజను మంది తీవ్రంగా గాయపడినా, వారు మాత్రం బతికి బయటపడ్డారు.రబ్బరు తూటాలు, లాఠీ దెబ్బలకు విగితా కొందరి కాళ్లు ఇతర అవయవాలు విరిగిపోయాయి. దీంతో వాళ్లు చికిత్స పొందుతున్నారని ఆసుపత్రి వర్గాలు తెలియజేశాయి. కొంతరికి చికిత్స పూర్తికావడంతో, వారిని డిశ్చార్జ్ చేసినట్టుగా చెప్పారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతన్నవారిలో లోబ్జాంగ్ రించెన్ కూడా ఉన్నారు. ఆయన మామ అప్పర్ లేహ్ కౌన్సిలర్ ఫంట్సోగ్ స్టాన్జిన్ త్సెపాగ్ హింసలో పాల్గొని బీజేపీ కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకున్నారని బీజేపీ ఆరోపించింది. దీని కోసం ఒక వీడియో క్లిప్పింగ్‌ను ఆధారంగా చూపించింది.హింస చెలరేగినప్పుడు త్సెపాగ్ గుంపులోనే ఉన్నారన్న విషయాన్ని లేహ్‌లో డ్రక్ లద్దాఖ్ హోటల్‌ను నిర్వహిస్తున్న 56 ఏళ్ల రించిన్ త్రోసిపుచ్చారు.“త్సెపాగ్ ఉదయం నిరసనలో పాల్గొని మధ్యాహ్నం 12:50 గంటలకే హోటల్‌కు వచ్చారు. హింస 1.15 గంటలకు మొదలైంది. ఆయన హోటల్లో ఉన్నట్టు చూపించడానికి తమ వద్ద సీసీటీవీ ఫుటేజిలున్నాయి. ఆ తర్వాత సాయంత్రం ఆయన కౌన్సిలర్ల హాస్టల్‌కు వెళ్లారు”అని రించిన్ వివరించారు.“మధ్యాహ్నం 2 గంటలకు పోలీసులు హోటల్‌కు వచ్చి మమ్మల్ని ధూషిస్తూ త్సెపాగ్ ఎక్కడున్నాడని అడిగారు. వారికి అన్ని విషయాలను వివరించాము. అయినప్పటికీ వారు మమ్మల్ని నమ్మలేదు. ఆ తర్వాత నన్ను పోలీసు స్టేషన్‌కు రమ్మని పిలిచి, బాగా చితకబాదారు. నేను ఇప్పుడు ఇక్కడ గాయాలకు చికిత్స పొందుతున్నాను” అని రించిన్ చెప్పారు.రించిన్ వాదనలపై వివరణ కోరడానికి తమ వార్తా సంస్థ ప్రయత్నించిందని, కానీ లద్దాఖ్ డీజీపీ ఎస్‌డిసింగ్ జాంవాల్ స్పందించలేదని ది ఇండియన్ ఎక్స్ప్రెస్ పేర్కొన్నది.

# నందగోకులం కొత్త ఎక్స్‌పీరియన్స్

నెల్లూరు, సమాజం వల్ల పైకి వచ్చిన ప్రతి ఒక్కరూ సమాజానికి తిరిగి ఇవ్వాలని సీఎం చంద్రబాబు సూచించారు. సమాజం రుణం తీర్చుకోవాలని అన్నారు. నెల్లూరు జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటించారు. ఈ నేపథ్యంలో నందగోకులం లైఫ్ స్కూల్‌కు చంద్రబాబు శ్రీకారం చుట్టారు. అనంతరం విశ్వసముద్ర బయో ఎనర్జీ ఇథనాల్ ప్లాంట్‌ను సందర్శించారు. అలాగే.. విశ్వసముద్ర గ్రూప్ ప్రాజెక్ట్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. నందగోకులంలో పశువుల పరిరక్షణ, లైఫ్ స్కూల్, ఇథనాల్ ప్లాంట్‌ను ప్రారంభించడం తనకు కొత్త ఎక్స్‌పీరియన్స్ అని చంద్రబాబు తెలిపారు. బొగ్గు, నీరు, సోలార్, గాలితో విద్యుత్ ఉత్పత్తి కాగా.. ప్రస్తుతం ఎద్దులతో విద్యుత్ ఉత్పత్తి చేయడం ఇదే తొలిసారి అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 2047 నాటికి ప్రపంచ దేశాల్లో భారత్ ప్రథమ స్థానంలో ఉంటుందన్న సీఎం.. అందులో ఏపీ నెంబర్ వన్‌గా ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడుల అంశాన్నీ సీఎం ప్రస్తావించారు. విశ్వసముద్ర ప్రాజెక్టులను ప్రారంభించడం సంతోషంగా ఉంది. వినూత్న ప్రయోగాలతో మూడు ప్రాజెక్టులను నెలకొల్పారు. మన రాష్ట్రంలో ఒంగోలు జాతి ఎద్దులు కనుమరుగయ్యాయి. కానీ, బ్రెజిల్‌లో ఒంగోలు జాతి బ్రీడ్‌ను ప్రపంచానికి అందించే పరిస్థితికొచ్చారు. 'నందగోకులం -సేవ్ ది బుల్' కార్యక్రమం చాలా విశిష్టమైనది. పేద విద్యార్థులను తీసుకొచ్చి నందగోకులం-లైఫ్ స్కూల్‌లో శిక్షణ ఇస్తున్నారు. సాధారణ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారు. సమాజం వల్ల పైకి వచ్చిన ప్రతి ఒక్కరూ సమాజానికి తిరిగి ఇవ్వాలని సీఎం అన్నారు. 15,000 టన్నుల ధాన్యం నూకలతో ఇథనాలు తయారు చేస్తున్నారని పేర్కొన్నారు. దీని ద్వారా రైతులకి ఆదాయం పెరుగుతుందని హర్షం వ్యక్తం చేశారు. ప్రకృతి పరిరక్షణకి కేంద్ర ప్రభుత్వం తెచ్చిన సంస్కరణలని అందిపుచ్చుకున్నారని చెప్పారు. ఎద్దులతో విద్యుత్తు ఉత్పత్తి చేయడం ఎక్కడా లేదని చెప్పారు. పవర్ ఆఫ్ బుల్స్ చాటుతూ.. 5 యూనిట్లు విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నారని చంద్రబాబు వివరించారు. నందగోకులం సేవ్ ది బుల్ అనే నినాదం ఎంతో విశిష్టమైందని చంద్రబాబు గుర్తు చేశారు. నందగోకులం లైఫ్ స్కూల్లో పేద పిల్లలకి చదువులు చెబుతున్నారని చెప్పారు. సామాన్య పిల్లలని అనితరసాధ్య వ్యక్తులుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేయడం గొప్ప విషయమని కొనియాడారు. సమాజం వల్ల పైకొచ్చిన వారు సమాజానికి డబ్బు ఇవ్వడం కాదు. పిల్లలకి అన్ని సదుపాయాలు కల్పించి, బెస్ట్ సిటిజన్స్‌లా తయారు చేయాలని ఆయన సూచించారు. చింతా శశిధర్ ఫౌండేషన్ ది బెస్ట్ స్కూల్ నడుపుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. దగదర్తిలో ఎయిర్ పోర్టు, కృష్ణపట్నంకి సీ పోర్టు, నేషనల్ హైవే, రైల్వే కనెక్టవిటీలు వస్తాయని స్పష్టం చేశారు. 2047లో ప్రపంచంలోనే మనదేశం ఒక శక్తిగా ఎదగబోతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. అందులో మన ఏపీ మరింత శక్తిగా ఎదుగుతుందని వివరించారు. విశాఖలో రూ. 87వేల కోట్లతో ఆర్టిఫిషియల్ సెంటర్ రాబోతుందని చెప్పారు. పేదలని బయటకి తీసుకువచ్చే బాధ్యత అందరూ తీసుకోవాలని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

# గాజాలో శాంతివీచిక!



రెండేళ్ల నుంచి అవిచ్ఛిన్నంగా క్షిపణులు, బాంబుల వర్షంతో కంటిమీద కునుకు లేకుండా గడిపిన గాజా ఇకపై గుండెల నిండా ఊపిరి పీల్చుకోనుంది. హమాస్-ఇజ్రాయెల్ యుద్ధం ఆగిపోయిందనీ, ఇరు పక్షాలూ కాల్పుల విరమణకు అంగీకరించాయనీ, శాంతి ప్రణాళికలో ఇది తొలి దశ అనీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన గమనిస్తే పూర్తిస్థాయి శాంతి స్థాపనకు మరికొంత సమయం పట్టొచ్చని స్పష్టంగానే తెలుస్తోంది. ఇంత హడావిడిగా సంధి కుదిరినట్టు ప్రకటించటం వెనక శుక్రవారం ప్రకటించబోయే నోబెల్ శాంతి బహుమతికి అర్హత సాధించటం కోసమేనని అందరికీ తెలుసు. ట్రంప్ అందుకు అర్హుడని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ సిఫార్సు చేస్తున్నారు. తమ భూభాగంలోకి చొరబడి 2023 అక్టోబర్ 7న 1,100 మంది పౌరులను హతమార్చి, 251 మందిని అపహరించుకుపోయిన హమాస్ దుందుడుకు చర్యకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ 24 నెలల పాటు గాజాపై నిప్పుల వాన కురిపించింది. ఏ క్షిపణి ఎక్కడ పడుతుందో, ఏ బాంబు ఎవరి ప్రాణం తీస్తుందో తెలియక గాజా వాసులు బిక్కుబిక్కుమంటూ గడిపారు. జనావాస ప్రాంతాలన్న ఇంగిత జ్ఞానం లేకుండా క్షిపణులు ప్రయోగించటం, ఆకాశాన్నంటే అపార్ట్‌మెంట్లు క్షణంలో కూలి శిథిలాల గుట్టగా మారటం ప్రపంచ ప్రజలంతా చూశారు. కనీసం ఇద్దరో ముగ్గురో మరణించని కుటుంబం లేదు. కొన్ని కుటుంబాలైతే పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. మధ్యలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాలు... ఇజ్రాయెల్ ఉల్లంఘనల వల్ల పెద్దగా ఉపశమనం ఇచ్చింది లేదు. దీన్ని యుద్ధం అనడం ఇజ్రాయెల్ సాగించిన నరమేధాన్ని కప్పిపుచ్చే యత్నమే అవుతుంది. బలాబలాల్లో ఎంత వ్యత్యాసం ఉన్నా రెండు దేశాల మధ్య పరస్పరం కొన సాగే ఘర్షణల్ని యుద్ధం అంటారు. ఇక్కడ జరిగిందంతా వేరు. ఇజ్రాయెల్ లోపాయకారీ మద్దతుతో ఎన్నికల ద్వారా అధికారం చేజిక్కించుకుని గాజా ప్రజలపై పెత్తనం సాగిస్తూ, పాలస్తీనా అథారిటీని బేఖాతరు చేస్తూ వచ్చిన హమాస్ ఉన్నట్టుండి ఉగ్రవాద దాడికి పూనుకొంది. ఇజ్రాయెల్ ప్రతీకార దాడుల్లో అధికారిక లెక్కల ప్రకారమే 67,183 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మరో 1,69,841 మంది గాయాల పాలయ్యారు. వైద్య సిబ్బంది, పాత్రికేయులన్న విచక్షణ లేకపోగా, చాలా సందర్భాల్లో వారిని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ సైన్యాలు హతమార్చటం ఆధునిక చరిత్రలో కనీవినీ ఎరుగనిది. దాడులు ఆగుతాయంటున్నారు గనుక శిథిలాల తొలగింపు మొదలవుతుంది. అప్పుడు గానీ మృతుల అసలు సంఖ్య ఎంతో తెలియకపోవచ్చు. ఇప్పటికీ ఆచూకీ తెలియనివారు వేలల్లో ఉన్నారు. ఇజ్రాయెల్ ఘాతుకాల వెనక జాత్యహంకారం స్పష్టంగా కనబడుతుండగా, ఆ దుండగాన్ని ధర్మబద్ధంగా వ్యతిరేకించినవారిని యూదులపై వివక్ష ప్రదర్శిస్తున్నవారిగా జమకట్టి వేధించటం, విశ్వవిద్యాలయాల్లోకి పోలీసులు చొరబడి అరెస్టులు చేయటం ట్రంప్ నైజానికి అద్దం పడుతుంది. గాజాలో హమాస్ ఒక్కటే లేదు. పాలస్తీనా విమోచన కోసం పోరాడే సంస్థలు డజను వరకూ ఉన్నాయి. ఇజ్రాయెల్ సైన్యం పూర్తిగా వెనక్కి పోలేదు. గాజాలోనే ఒక హద్దు నిర్ణయించుకుని ఆగింది. ఇప్పుడు కుదిరిన ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఎంతవరకూ గౌరవిస్తుందో తెలియదనీ, ఒప్పందంలోని చాలా క్లాజులు అస్పష్టతతో ఉన్నా కేవలం ట్రంప్ హామీని నమ్మి సమ్మతించామనీ ఆ సంస్థల ప్రతి నిధులు చెబుతున్న తీరు గమనార్హం. ట్రంప్‌కు నోబెల్ వస్తే తప్ప ఈ ఒప్పందం సజావుగా ముందుకు పోదు. రెండో దశ చర్చల్లోనే అసలు అంశాలు ప్రస్తావనకొస్తాయి. అప్పుడు మరణమో, శరణమో పాలస్తీనా సంస్థలు తేల్చుకోక తప్పదు. ట్రంప్‌కు పురస్కారం లభిస్తే గాజా వాసులకు ఉన్నంతలో గౌరవప్రదమైన పరిష్కారం దొరకొచ్చు. రాకపోతే పరిణామాలు వేరుగా ఉండే అవకాశం ఉంది. అయితే నరమేధాన్ని కొనసాగించటం ఇక సాధ్యపడకపోవచ్చు. ఎందుకంటే హమాస్ చెరలోని బందీలంతా విడుదలయ్యారు. అటు ఇజ్రాయెల్ జైళ్లలోని పాలస్తీనా పౌరులు దాదాపు 2,000 మంది విడుదలవుతున్నారు. గాజా విషయంలో ఐక్యరాజ్య సమితిలో అమెరికా, ఇజ్రాయెల్ ఒంటరిగా మిగిలిపోయిన కొన్ని రోజులకే ఆ రెండు దేశాలూ తమకేం పట్టనట్టు ఈ శాంతి ఒప్పందం సాధించటం ఒక వైచిత్రి.

# గాజా శాంతి ప్రణాళికకు ఓకే

న్యూఢిల్లీ,గాజా శాంతి ప్రణాళికను ఇజ్రాయిల్ కేబినెట్ శుక్రవారం తెల్లవారుజామున ఆమోదించింది. ఇది మధ్యప్రాచ్యాన్ని అస్థిరపరిచిన రెండేళ్ల వినాశకరమైన యుద్ధాన్ని ముగించే దిశగా కీలకమైన అడుగుగా భావించాలి. బందీలను విడుదల చేసే ఒప్పందం మేరకు క్యాబినెట్ ఆమోదించిందని ప్రధాని నెతన్యాహూ కార్యాలయం నుండి విడుదలైన సంక్షిప్త ప్రకటన తెలిపింది. అయితే ఈ ప్రణాళికలోని ఇతర అంశాలను ప్రస్తావించలేదు. కేబినెట్ ఓటింగ్‌కు కొన్ని గంటల ముందు కూడా ఇజ్రాయిల్ దాడులు కొనసాగాయి. గురువారం ఉత్తర గాజాలో పేలుళ్లు కనిపించాయి. గాజా నగరంలోని ఒక భవనంపై జరిగిన దాడిలో సుమారు ఇద్దరు మరణించగా, 40మందికి పైగా శిథిలాల కింద చిక్కుకున్నారని పాలస్తీనా పౌర రక్షణ శాఖ తెలిపింది. గత 24 గంటల్లో సుమారు 11 మంది పాలస్తీనియన్లు మరణించగా, 49మంది గాయపడి ఆస్పత్రులను చేరుకున్నారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. గత రెండేళ్లుగా ఇజ్రాయిల్ గాజాపై జరిపిన దాడిలో 67,000 మంది పాలస్తీనియన్లు మరణించారు. సుమారు 1,70,000 మంది గాయపడ్డారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. మృతుల్లో అత్యధికశాతం మంది మహిళలు, చిన్నారులే పేర్కొంది. ఇకపోతే చరిత్రాత్మక గాజా శాంతి ప్రణాళిక విజయవంతం కావడానికి కృషి చేసినందుకు గాను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పై ఇజ్రాయెల్ ప్రశంసలు కురిపించింది. తమ పార్లమెంట్ కు వచ్చి ప్రసంగించాల్సిందిగా ఇజ్రాయెల్ పార్లమెంట్ స్పీకర్ అమిర్ ఒహన అమెరికా అధ్యక్షుడిని ఆహ్వానిస్తూ లేఖ రాశారు. అందులో ట్రంప్‌ను యూదులకు గొప్ప మిత్రుడిగా అభివర్ణించారు. ట్రంప్‌ను ఆహ్వానిస్తూ.. వైట్‌హౌస్‌కు రాసిన లేఖను అమిర్ ఒహన సోషల్ మీడియాలో పంచుకున్నారు. హమాస్ చెరలో బందీలుగా ఉన్న తమ పౌరులు విడుదలయ్యే విషయంలో ట్రంప్ చూపిన చొరవను అమిర్ ఒహన ప్రశంసించారు. తమ సైనికుల త్యాగం, ప్రధాని నెతన్యాహు సంకల్పం, ఆయనకు ట్రంప్ ఇచ్చిన మనోధైర్యం వల్లే ఈ విజయం సాధించామన్నారు. ట్రంప్ నాయకత్వంలో అమెరికా మిలిటరీ నైతిక విలువల్లోనూ సూపర్ పవర్‌గా నిలిచిందని కొనియాడారు. బలంతో శాంతిని సాధించొచ్చని అమెరికా అధ్యక్షుడు నిరూపించారన్నారు. 2008లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జి బుష్ ఇజ్రాయెల్‌లో పర్యటించిన అనంతరం.. అమెరికా అధ్యక్షుడి స్థానంలో ఉన్నవారు తమ దేశానికి వచ్చి, ప్రసంగించడం ఇదే మొదటిసారని పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య ఉన్న బలమైన బంధాలకు ఈ ఆహ్వానం నిదర్శనమన్నారు. ఇజ్రాయెల్-హమాస్ మధ్య సుదీర్ఘ యుద్ధాన్ని నిలిపివేసేందుకు ఇజ్రాయెల్-హమాస్ తాజాగా అంగీకరించాయి. బందీలు, ఖైదీల విడుదలకు సమ్మతించాయి. ఇజ్రాయెల్, హమాస్ ఒప్పందంపై తొలుత ట్రంప్ ప్రకటన చేశారు. యుద్ధం ముగింపు తొలి దశ ప్రణాళికకు ఆ రెండు వర్గాలు అంగీకరించాయని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ ఒప్పందం ప్రకారం- హమాస్ చెరలోని బందీలంతా అతి త్వరలో విడుదలవుతారు. గాజా నుంచి ఇజ్రాయెల్ క్రమంగా తన బలగాలను ఉపసంహరించుకుంటుంది. బలమైన, మన్నికైన, శాశ్వత శాంతికి ఈ చర్యలు తొలి అడుగులవుతాయని ట్రంప్ పేర్కొన్నారు. ఒప్పందం విషయాన్ని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ధ్రువీకరించారు. గాజాలో యుద్ధం ముగింపునకు బాటలు పరిచే ఒప్పందానికి తాము సమ్మతి తెలిపామని హమాస్ సైతం స్పష్టం చేసింది.

# అట్లుంటదీ మనోతోని..

న్యూఢిల్లీ,భారతదేశం రూపొందించిన ఆధార్ మోడల్ ఇప్పుడు ప్రపంచ దేశాలకు ప్రేరణగా మారింది. తాజాగా బ్రిటన్ రాజకీయాల్లోనూ అదే మోడల్ చర్చనీయాంశమైంది. యూకే ప్రధాని కీర్ స్టార్మర్ తన దేశంలో డిజిటల్ ఐడీ వ్యవస్థను ప్రవేశపెట్టే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందుకోసం ఆయన ఇటీవల భారత్ పర్యటన సందర్భంగా ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకనితో ప్రత్యేకంగా భేటీ కావడం ప్రత్యేక ఆసక్తికరంగా మారింది.

### భారత ఆధార్ మోడల్‌కు ప్రేరణగా యూకే

భారతదేశంలో ఆధార్ వ్యవస్థ ద్వారా ప్రతీ పౌరుడి గుర్తింపు ఒక్క నంబర్ ద్వారా సాధ్యమైంది. ఈ సిస్టమ్ వల్ల ప్రజా సేవలు, సబ్సిడీలు, బ్యాంకింగ్, ఆరోగ్య సేవలు అన్నీ మరింత సులభతరం అయ్యాయి. ఈ మోడల్‌ను స్టడీ చేసిన స్టార్మర్, “ఇండియాలో ఇది హిట్ అయింది కాబట్టి, బ్రిటన్‌కూ ఇది ఉపయోగపడుతుంది” అని పేర్కొన్నారు.

### డిజిటల్ ఐడీ కార్డులపై సీరియస్ ప్లాన్

స్టార్మర్ ప్రభుత్వం ప్రతీ పౌరుడికి డిజిటల్ ఐడీ కార్డు తప్పనిసరి చేయాలని భావిస్తోంది. ఈ కార్డు లేకుండా ఎవరూ పని చేయలేరని ఆయన ఇప్పటికే ప్రకటించారు. దేశంలో అక్రమంగా పనిచేసేవారిని అరికట్టడమే కాకుండా, అండర్‌గ్రౌండ్ ఎకానమీని కంట్రోల్ చేయడంలో ఇది సహాయపడుతుందని ఆయన అన్నారు. అంతేకాకుండా హెల్త్‌కేర్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ వంటి ప్రభుత్వ సేవలను సులభంగా అందించడంలో ఇది కీలకమని చెప్పారు.

### పౌర హక్కుల సంఘాల వ్యతిరేకత

అయితే బ్రిటన్‌లో ఈ ఆలోచనపై భారీ వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత బ్రిటన్ పౌరులకు తప్పనిసరి ఐడీ కార్డులు లేవు. ఇప్పుడు వాటిని మళ్లీ తీసుకురావడం వ్యక్తిగత స్వేచ్ఛపై దాడిగా పరిగణిస్తున్నారు. పౌర హక్కుల సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు ఇది ప్రైవసీకి ముప్పు అని తీవ్రంగా విమర్శిస్తున్నాయి.గతంలో మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ కూడా బయోమెట్రిక్ ఐడీ కార్డులు తీసుకురావడానికి ప్రయత్నించారు. కానీ ప్రజల వ్యతిరేకతతో ఆ ప్రాజెక్ట్ నిలిచిపోయింది. అయితే స్టార్మర్ మాత్రం ఈసారి తన ప్లాన్ తప్పక సక్సెస్ అవుతుందని నమ్ముతున్నారు.

### బయోమెట్రిక్ డేటా లేకుండానే ప్లాన్

ప్రస్తుతానికి యూకే ప్రభుత్వం బయోమెట్రిక్ వివరాలు (వేలిముద్రలు, ఐరిస్ స్కాన్‌లు) వాడే ఆలోచనలో లేదని అధికార ప్రతినిధులు తెలిపారు. అంటే ఆధార్ లాంటి పూర్తి బయోమెట్రిక్ సిస్టమ్ కాకుండా, సాధారణ డిజిటల్ ఐడీ కార్డు రూపంలో వ్యవస్థను అమలు చేయాలని చూస్తున్నారు.

### “ఇండియా మోడల్” విజయాన్ని అందిపుచ్చుకునే ప్రయత్నం

యూరోప్‌తో పోలిస్తే బ్రిటన్‌లో వ్యక్తిగత గోప్యతకు ఎక్కువ ప్రాధాన్యత ఉంది. అయినా కూడా ప్రస్తుత కాలంలో ప్రతి రంగంలో ఐడీ అవసరం పెరుగుతున్న నేపథ్యంలో డిజిటల్ ఐడీ అనేది సౌలభ్యాన్ని, సమర్థతను పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు.భారతదేశం చూపించిన మార్గంలో యూకే అడుగులు వేస్తోంది. అయితే స్టార్మర్ ఆధార్ తరహా ప్లాన్ తన దేశ ప్రజల ఆమోదం పొందుతుందా లేదా అనేది రాబోయే రోజుల్లో తేలాల్సి ఉంది.

# 2లక్షల లంచం డిమాండ్‌తో దొరికిపోయిన తాసిల్దార్

నల్లగొండ,నల్లగొండ జిల్లా చిట్యాల మండల తహసీల్దార్ కృష్ణ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. గుండ్రంపల్లి గ్రామ పరిధిలోని వ్యవసాయ భూమికి సంబంధించన మ్యూటేషన్ కోసం రూ. 2లక్షలు డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. తహసీల్ కార్యాలయంలో వ్యూహం ప్రకారం మాటువేసిన ఏసీబీ అధికారులు గురువారం తహసీల్దార్ గుగులోత్ కృష్ణా , మరో ప్రైవేట్ వ్యక్తి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 2 లక్షల నగదును స్వాధీనం చేసుకుని నాంబర్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టామని వెల్లడించారు.

# మరియా కొరీనాను వరించిన నోబెల్ శాంతి

స్వీడన్,ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి 2025 మరియా కొరీనా మచాడోను వరించింది. ఈ విషయాన్ని నార్వే నోబెల్ కమిటీ శుక్రవారం ప్రకటించింది. వెనెజువెలాకు చెందిన మరియా కొరీనా ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడినందుకు గానూ ఈ పురస్కారం లభించింది. అయితే, ఈ అత్యున్నత పురస్కారం కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. ఈ ఏడాది మొత్తం 338 మంది ఈ శాంతి పురస్కారానికి నామినేట్ అవ్వగా.. అకాడమీ సభ్యులు మరియా వైపు మొగ్గుచూపారు. వెనెజువెలా ప్రజల హక్కుల కోసం అవిశ్రాంత పోరాటం చేసినందుకు గాను మచాడోకు ఈ పురస్కారం ఇస్తున్నట్లు నోబెల్ కమిటీ వెల్లడించింది. నియంతృత్వం నుంచి ప్రజాస్వామ్య సాధన కోసం శాంతి మార్గంలో ఆమె విశేష కృషి చేశారని తెలిపింది. ఈ క్రమంలో మచాడో ఎన్నో బెదిరింపులు ఎదుర్కొన్నారని.. గత ఏడాది కాలంగా అజ్ఞాతంలో జీవించాల్సి వచ్చిందని పేర్కొంది. ఆమె వెనెజువెలా పార్లమెంట్ సభ్యురాలిగా, దేశ విపక్ష నేతగా పనిచేశారు. వెనెజువెలా సైనికీకరణను తీవ్రంగా వ్యతిరేకించిన ఆమె.. శాంతియుత మార్గంలో ప్రజాస్వామ్యం కోసం కృషిచేసి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారని నోబెల్ కమిటీ వెల్లడించింది. నోబెల్ శాంతి బహుమతిని 1901 నుంచి 105 సార్లు ప్రకటించారు. ఇందులో 111 మంది వ్యక్తులు, 31 సంస్థలు ఇప్పటివరకు ఈ పురస్కారాన్ని అందుకున్నాయి. ఈ అవార్డు అందుకున్న అతిపిన్న వయస్కురాలిగా పాకిస్థాన్‌కు చెందిన హక్కుల కార్యకర్త మలాలా యూసఫ్‌జాయ్ నిలువగా.. జోసెఫ్ రాట్‌బ్లాట్ 86 ఏళ్ల వయసులో దీనిని అందుకున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి వెనెజులా ప్రతిపక్ష నేత మరియా కొరినా మచాడోను వరించింది. ఆ దేశ ప్రజల ప్రజాస్వామ్య హక్కుల కోసం చేసిన పోరాటానికి గాను ఆమెను ఈ బహుమతికి ఎంపిక చేశారు. నోబెల్ శాంతి బహుమతికి మరియా కొరినా ఎంపిక కావడంతో.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆ బహుమతిపై పెట్టుకున్న ఆశలు గల్లంతయ్యాయి. నోబెల్ శాంతి బహుమతి అందుకోవాలని ట్రంప్ అధ్యక్ష పీఠంపై ఎక్కిన నాటి నుంచి తహతహలాడిపోతున్నారు. ఆ క్రమంలోనే పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో పీవోకేతోపాటు పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత సైన్యం దాడులు చేపట్టింది. కొన్ని గంటల తర్వాత ఈ దాడులు ఆగిపోయాయి. దీంతో ఈ దాడులు తన ఆదేశాలకు అనుగుణంగానే ఆగిపోయాయంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వివిధ వేదికల మీద నుంచి పలు సందర్భాల్లో ప్రపంచానికి చాటే ప్రయత్నాన్ని చేశారు. కానీ ట్రంప్ చేసిన ఈ తరహా వ్యాఖ్యలను భారత్ నిర్ద్వంద్వంగా తొసిపుచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా గాజా-హమాస్ యుద్ధవిరమణకు ఒత్తిడి తెచ్చారు. అయినా ఆశలు దక్కలేదు.

# విజయసాయి కుమార్తెకు హైకోర్టు ఝులక్

అమరావతి, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డితోపాటు ఆమె కంపెనీ అవ్యాన్ రియల్టర్స్ ఎల్‌ఎల్‌పీకి ఏపీ హైకోర్టు ఝులక్ ఇచ్చింది. విశాఖపట్నం జిల్లాలోని భీమునిపట్నం పరిధిలో సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా సముద్రానికి అతి సమీపంలో నిర్మించిన కాంక్రీట్ గోడను కూల్చేందుకు ఖర్చు అయిన రూ. 48.21 లక్షలను జీవీఎంసీ వద్ద జమ చేయాలని విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డిని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణలోగా ఈ నగదు మొత్తాన్ని గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) వద్ద జమ చేయాలని సూచించింది. అలాగే కాంక్రీట్ నిర్మాణం కారణంగా ప్రకృతికి నష్టం జరిగిందని సంబంధిత కంపెనీ నుంచి రూ 17. 46 కోట్ల నష్ట పరిహారం రాబట్టాలని కేంద్ర అటవీ - పర్యావరణ మంత్రిత్వ శాఖ నేతృత్వంలోని కమిటీ ఇచ్చిన నివేదికపై సైతం స్పందన తెలియజేయాలని అవ్యాన్ రియల్టర్స్ ఎల్‌ఎల్‌పీకి స్పష్టం చేసింది. ఈ కేసుకు సంబంధించి తదుపరి విచారణ అక్టోబర్ 16వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ధర్మాసనం గురువారం ఆదేశాలు జారీ చేశారు.కాంక్రీట్ గోడ కూల్చివేతకు అయ్యే ఖర్చు మొత్తాన్ని ఆ కంపెనీ నుంచే వసూలు చేయాలని జీవీఎంసీ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. అక్రమ కాంక్రీట్ నిర్మాణాలతో ప్రకృతికి జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు నిపుణులతో కూడిన కమిటీ వేయాలని కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖకు సైతం ఏపీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. విశాఖపట్నంలోని జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ వేసిన పిటీషన్‌పై గురువారం ఏపీ హైకోర్ట్‌లో విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు భీమునిపట్నం సమీపంలో సీఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి రెస్టోబ్రార్లు నిర్మాణం చేశారంటూ ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ఆథారిటీ (ఏపీసీజెడిఎంఎ) మెంబర్ సెక్రెటరీ, జీవీఎంసీ కమిషనర్, విశాఖ జిల్లా కలెక్టర్‌తో కూడిన కమిటీ నివేదిక సమర్పించింది. ఈ నేపథ్యంలో దీనిపై స్పందన తెలపాలని రెస్టోబ్రార్ యాజమాన్యాలకు సైతం ఈ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. అలాగే సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన నాలుగు రెస్టోబ్రార్లను తొలగించడంతో పాటు సహజ ఆవాసాలను పునరుద్ధరించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై ఇటీవల విచారణ జరిపిన ధర్మాసనం వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె పెనక నేహారెడ్డి కంపెనీపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ ఏపీ కోస్టల్ మేనేజ్‌మెంట్ ఆథారిటీ (ఏపీసీజెడ్ఎంఏ) మెంబర్ సెక్రెటరీని ఆదేశించిన విషయం విదితమే.

## ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక స్టేలు ఇవ్వలేదు

న్యూఢిల్లీ, ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత సుప్రీంకోర్టుగాని, హైకోర్టుగాని స్టే ఇచ్చిన దాఖలాలు లేవని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి తెలిపారు. గతంలో సుప్రీంకోర్టు మూడు నెలల్లోగా రాష్ట్రపతి, గవర్నర్ బిల్లుకు ఆమోదం తెలపకపోతే.. ఆమోదం పొందినట్టుగా భావించాల్సి ఉంటుందని చెప్పిందని గుర్తుచేశారు. పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్లు ఇవ్వడంతో చాలామంది నామినేషన్లు వేశారని పేర్కొన్నారు. ఎన్నికలు పెట్టకపోవడంతో పంచాయతీకి రావాల్సిన నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి రావడం లేదని స్పష్టం చేశారు. చట్టం ప్రకారం బీసీ రిజర్వేషన్లు చేశామని మల్లు రవి తెలిపారు. అసెంబ్లీలో పెట్టామని, అన్ని పార్టీలు కూడా మద్దతు తెలిపాయని పేర్కొన్నారు. బీసీలు 56 శాతం ఉన్నారని రిపోర్ట్ వచ్చిందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం 10శాతం వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పించిందని చెప్పారు. 50? సీలింగ్ అప్పుడే దాటిందని అన్నారు. హైకోర్టు స్టే ఇవ్వడం ప్రజాస్వామ్య వ్యవస్థను పక్కన పెట్టినట్టు గుర్తించాల్సిందే అని వెల్లడించారు. రిజర్వేషన్లపై జడ్జిమెంట్ రావడం అంటే ప్రజాస్వామ్యం గురించి చాలా లోతుగా అసెంబ్లీలో, పార్లమెంట్లో చర్చ జరగాలని ఆయన సూచించారు.న్యాయ వ్యవస్థను గౌరవిస్తున్నామని ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని రక్షించే వ్యవస్థ న్యాయవ్యవస్థ అని పేర్కొన్నారు.

# ట్రంప్ నోబెల్ కల చెదిరింది..వైట్ హౌస్ ఫైర్

వాషింగ్టన్:నోబెల్ శాంతి బహుమతి కోసం కలలుగన్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కలలు చెదిరిపోయాయి. నోబెల్ శాంతి బహుమతిని నోబెల్ కమిటీ వెనిజులా విపక్ష నేత, ఎంపీ మరియా కొరీనా మచోడాకు ప్రకటించడంతో ట్రంప్ నోబెల్ ఆశలు ఆవిరైపోయాయి. తాను ఇప్పటికే ప్రపంచంలో 7యుద్ధాలు ఆపానని..తాజాగా హమాస్ - ఇజ్రాయిల్ యుద్ధంతో 8వ యుద్ధం కూడా ఆపి శాంతి స్థాపనకు కృషి చేశానని..తనకు నోబెల్ శాంతి బహుమతి రావాలని ట్రంప్ కొన్ని రోజులుగా ప్రచారం చేసుకుంటూ దానిపై భారీ ఆశలే పెట్టుకున్నారు. తనకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలంటూ రష్యా, ఇజ్రాయెల్, పాక్ సహా పలు దేశాలతో నామినేట్ సైతం చేయించుకున్నారు. నోబెల్ ప్రకటనకు ముందు స్పందిస్తూ.. ఆ అవార్డు నాకు రాకపోతే అమెరికాకు అవమానం అని ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచం కోసం ఏమీ చేయకపోయినా ఒబామాకు నోబెల్ శాంతి బహుమతి ఇచ్చారని, ఎనిమిది యుద్ధాలు ఆపిన తనకు వస్తుందో, రాదో తెలియడం లేదంటూ అక్కసు వెళ్లగక్కారు. తాను ఎన్ని మంచి పనులు చేసినా.. నోబెల్ మాత్రం ఇవ్వరంటూ ఓ సందర్భంలో ఆవేదన చెందారు. ఇంత చేసినప్పటికి నోబెల్ కమిటీ మాత్రం ట్రంప్ ను పట్టించుకోలేదు. ట్రంప్ ఆశలను అడియాశలు చేస్తూ.. మరియా కొరీనా నోబెల్ శాంతి బహుమతి ప్రకటించింది. ట్రంప్ కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలంటూ వచ్చిన నామినేషన్లు అన్నీ నిర్దేశిత గడువు జనవరి 31 తర్వాతే రావడం గమనార్హం. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది 2026నోబెల్ శాంతి బహుమతి రేసులో ట్రంప్ ఖచ్చితంగా ఉంటారని..శాంతి బహుమతి కోసం ఆయన యుద్ధం ఇప్పుడే మొదలైందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నోబెల్ దక్కకపోవడంపై ట్రంప్ కార్యవర్గం అసంతృప్తి

ట్రంప్ కు నోబెల్ శాంతి బహుమతి దక్కకపోవడం పట్ల ట్రంప్ కార్యవర్గం ఎక్స్ వేదికగా తీవ్ర అసంతృప్తి వెళ్లగక్కింది. ప్రపంచశాంతికి నిజమైన నిబద్ధత చూపిన వారిని నోబెల్ కమిటీ పక్కన పెట్టిందని..శాంతి స్థాపన కంటే రాజకీయాలకే నోబెల్ కమిటీ ప్రాధాన్యం ఇచ్చిందంటూ వైట్ హౌస్ కమ్యూనికేషన్ డైరెక్టర్ స్టీవెన్ చుయెంగ్ ఎక్స్ లో ఆక్షేపించారు. యుద్ధాలను ఆపేందుకు ట్రంప్ ప్రయత్నాలు చేస్తూనే ఉంటారని స్పష్టం చేశారు. శాంతి ఒప్పందాలతో ప్రాణాలు



నిలబెడుతారు. ఆయన మానవతావాది. తన సంకల్ప శక్తితో పర్వతాలను కదిలించే ఆయనలాంటి వ్యక్తి మరొకరు ఉండరు అని చుయెంగ్ తన పోస్టులో పేర్కొన్నారు.

నోబెల్ కమిటీ వివరణ

యుద్ధాలు ఆపినాపలు దేశాల నుంచి మద్దతు వచ్చినా..ట్రంప్ కు నోబెల్ రాకపోవడంపై నార్వేజియన్ నోబెల్ కమిటీ చైర్మన్ జొర్గెన్ వాట్నె ఫ్రిడ్నెస్ స్పందించారు. ఆల్ఫ్రెడ్ నోబెల్ ఆశయాలకు అనుగుణంగా విజేతలను ఎంచుకుంటామని స్పష్టం చేశారు. నోబెల్ కమిటీ మీడియా, బహిరంగ ప్రచారాలను నిరంతరం గమనిస్తుంటుందని.. నోబెల్ గ్రహీతల చిత్రాలు ఉన్న గదిలో కూర్చుని ఆ లేఖలను మేం చూస్తాం అని తెలిపారు. ఆ గది మాకు ధైర్యాన్నిస్తుందని.. సమగ్రతతో పనిచేసే సంకల్పాన్ని కలిగిస్తుందని.. ఆల్ఫ్రెడ్ నోబెల్ ఆశయాలకు అనుగుణంగా మేం నిర్ణయాలు తీసుకుంటాం" అని వివరించారు.అటు శాంతి స్థాపనలో త్వరితగతిన దక్కిన దౌత్య విజయాలకంటే.. స్థిరమైన, బహుపాక్షిక ప్రయత్నాలకు నోబెల్ కమిటీ ప్రాధాన్యం ఇస్తుందని చరిత్రకారుడుగా థియో జెనౌ అభిప్రాయపడ్డారు. పలు యుద్ధాలను ఆపి ట్రంప్ చేసిన శాంతి ప్రయత్నాలు సుస్థిర ఫలితాలు ఇస్తాయని ఇంకా నిరూపితం కాలేదని..ఒక ఘర్షణను స్వల్పకాలంపాటు ఆపడానికి.. దాని మూలకారణాలు గుర్తించి, పరిష్కరించడానికి మధ్య చాలా తేడా ఉంటుందని వివరించారు. అయితే ట్రంప్ వచ్చే నోబెల్ రేసులో ప్రధాన పోటీదారుగా ఉంటారన్నారు.

# ఉమ్మడి విశాఖలో భూలూటీ...



విశాఖ: రాష్ట్ర ఆర్థిక రాజధానిగా గుర్తింపు పొందిన ఉమ్మడి విశాఖ జిల్లాలో పెద్ద ఎత్తున భూ లూటీ జరుగుతోంది. సెజ్‌లు, కారిడార్‌లు, ఐటి కంపెనీల పేరుతో లక్షల కోట్ల విలువైన భూమిని కార్పొరేట్లకు పాలకులు పందేరం చేస్తున్నారు. 2005 నుంచి ఈ తతంగం సాగుతోంది. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో 135 కిలోమీటర్ల పరిధిలోగల సముద్ర తీరంలో సెజ్‌లు, ఐటి, ఫార్మా కంపెనీల పేరుతో లక్షల ఎకరాల్లో ఈ భూ పందేరం కొనసాగుతోంది. ఇంత పెద్ద ఎత్తున భూ పందేరం జరుగుతున్నా వాటి ద్వారా వచ్చిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మాత్రం నామమాత్రమే! విశాఖ నగరం, గ్రామీణ ప్రాంత పరిసరాలు, మధురవాడ, రుషికొండల్లో రూ.6 వేల కోట్లు విలువైన సుమారు నాలుగు వేల ఎకరాలను ఐటి కోసం టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక కేటాయింపులు చేసింది. అనకాపల్లి జిల్లాలో విశాఖ-చెన్నరు కారిడార్, సెజ్‌ల పేరిట లక్ష ఎకరాలకుపైగా కార్పొరేట్లకు అప్పగించాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. వీటిలో గడిచిన 15 ఏళ్లుగా రూ.40 వేల కోట్ల విలువైన 50 శాతానికిపైగా భూములను కార్పొరేట్లు ఇప్పటికే స్వాధీనం చేసుకున్నారు. గాజువాక నియోజకవర్గంలో అదాని గంగవరం పోర్టు స్టీల్‌ప్లాంట్ నుంచి 1,200 ఎకరాలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి 1,800 ఎకరాలు తీసుకుని స్థానిక మత్స్యకారులకు ఉపాధి చూపకుండా నిర్వాసితులను చేసి 1,700 మంది బయట కార్మికులతో పోర్టును నిర్వహిస్తోంది.

ఐటి పేరుతో కారుచౌకగా కట్టబెట్టిన వైనం

విశాఖ రుషికొండపై తాజాగా టిడిపి కూటమి ప్రభుత్వం 21.16 ఎరాలను టిసిఎస్‌కు ఎకరా 99 పైసలకు (ఈ భూముల వాస్తవ విలువ రూ.900 కోట్లు) ఇచ్చేసింది. 12 వేల ఉద్యోగాలు టిసిఎస్ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. వాస్తవానికి ఈ కంపెనీ ముంబయిలో ఇటీవల 12 వేల మందిని తొలగించేసింది. అమెరికన్ కంపెనీ కాగ్నిజెంట్‌కు 22.19 ఎకరాలను ఎకరా 99 పైసలకే (వాస్తవంగా వీటి విలువ రూ.950 కోట్లు) ధారాదత్తం చేసింది. ఎనిమిది వేల ఉద్యోగాలు వస్తాయని చెబుతోంది. ఈ కంపెనీ భారతదేశంలో 10,700 మందిని ఇప్పటికే తొలగించింది. రుషికొండ- మధురవాడ కొండపై ఎఎన్‌ఎస్‌ఆర్ ఐటికి రూ.500 కోట్లు విలువైన 10.29 ఎకరాలను ఎకరా ఒక్కింటికి 99 పైసలకే చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చేసింది. పది వేల ఉద్యోగాలు ఇస్తారని చెబుతోంది. పైన చెబుతున్న వాటిలో ఎఐ టెక్‌తో నడిచేవీ ఉండడంతో ఉద్యోగాల కల్పన మాటలకే పరిమితమన్న విషయం ఇట్టే అర్థమవుతుంది. రూ.2 వేల కోట్లు విలువైన విశాఖ తీరంలోని 14 ఎకరాలను లూలూ మాల్‌కు రూ.400 కోట్లలోపు ధరకే చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చేసింది. విశాఖ జిల్లా ఆనందపురం మండలం తర్లువాడలో రూ.500 కోట్ల విలువైన 300 ఎకరాల భూమిని గూగుల్ సంస్థకు ధారాదత్తం చేసేస్తోంది. మొత్తంగా ఐటి కంపెనీల పేరుతో రూ.6 వేల కోట్ల భూములకు స్కెచ్ వేశారు.

ఐటి కంపెనీల్లో ఉపాధి ఎంత?

2015 నుంచి ఐటి కంపెనీల ప్రగతి శూన్యం. ఈ కాలంలో 25 వేల మందే ఉద్యోగులు ఉన్నారు. 2014-15 కాలంలో మధురవాడ -కాపులుప్పాడల్లో అదాని 132 ఎకరాలను ఐటి డేటా సెంటర్ కోసం తీసుకుని ఇంతవరకూ కార్యకలాపాలు చేపట్టలేదు. విశాఖ నగరం నడిబొడ్డున మద్దిలపాలెంలో రూ.వందల కోట్ల విలువైన ఎనిమిది ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని విప్రో, టెక్ మహీంద్ర, డబ్ల్యుఎన్‌ఎస్ సంస్థలు తీసుకుని ఒక్కో సంస్థ మూడు వేలకుపైగా ఉద్యోగాలు ఇస్తామని ఎరవేశాయి. అవి ఇచ్చిన ఉద్యోగాలు మొత్తంగా నేటికీ మూడు వేలకు దాటలేదు. పెందుర్తి మండలం గుర్రంపాలెంలో 22 ఎకరాలను ల్యాండ్ బ్యాంక్ పేరుతో గతంలో చంద్రబాబు ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పదేళ్లు దాటుతున్నా అక్కడ ఇప్పటికీ ఎలాంటి ఎలక్ట్రానిక్స్ పార్కు రాలేదు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో మిట్టల్ స్టీల్‌ప్లాంట్, బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు కోసం పెద్ద మొత్తంలో భూములను తీసుకున్నారు. అచ్యుతాపురంలో సుమారు పదహారేళ్ల క్రితం టెక్స్‌టైల్ సెజ్ కింద నోటిఫై అయిన శ్రీలంకకు చెందిన బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ప్రయివేట్ లిమిటెడ్‌కు ఎకరా రూపాయి చొప్పున వెయ్యి ఎకరాలను ప్రభుత్వం ఇచ్చేసింది. ఇప్పటికి 490 ఎకరాల్లో మాత్రమే అక్కడ పరిశ్రమలు వచ్చాయి.

అతిపెద్ద భూ లూటీకి తెరుచుకున్న ద్వారాలు

పెట్రోలియం కెమికల్స్ అండ్ పెట్రోకెమికల్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీజియన్ (పిసిపిఐఆర్) పేరుతో చంద్రబాబు 2014లోనే భూములపై దృష్టి సారించారు. తాజాగా పిసిపిఐఆర్‌కు విశాఖ చెన్నరు ఇండస్ట్రియల్ కారిడార్ (విసిఐసి)గా పేరు మార్చారు. అనకాపల్లి జిల్లాలో పిసిపిఐఆర్ కోసం ఆరు మండలాల్లోని 67 పంచాయతీల పరిధిలోగల 83 గ్రామాల నుంచి 1,03,607 ఎకరాల భూమిని సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకూ రూ.40 వేల కోట్ల విలువైన సుమారు 50 శాతానికిపైగా భూములను సేకరించారు.

# జీఎస్టీ సంస్కరణలతో వైద్యరంగంలో విప్లవం

విజయవాడ, ముఖ్యమంత్రి చొరవతో అందుబాటులోకి వచ్చిన జీఎస్‌టీ సంస్కరణల ఫలాలతో సామాన్యులకు ఎంతో మేలు జరుగుతుందని.. సూపర్ జీఎస్‌టీ - సూపర్ సేవింగ్స్‌తో సామాన్యుల జీవితాల్లో కొత్త వెలుగులు వస్తున్నాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. సూపర్ జీఎస్‌టీ 2.0తో వివిధ రంగాల్లో భారం తగ్గిందని.. జీవిత బీమాపై పాత రేటు 18 శాతం ఉంటే ఇప్పుడది సున్నా శాతం అయిందని, ఆరోగ్య-కుటుంబ బీమాలోనూ ఇదే రకమైన మినహాయింపు అందుబాటులోకి వచ్చిందన్నారు. గతంలో ప్రాణ రక్షక మందులపై జీఎస్‌టీ 12 శాతం ఉంటే ఇప్పుడది సున్నా శాతం అయిందన్నారు. వైద్య పరికరాలు, డయాగ్నస్టిక్ కిట్లుపై 12 శాతం ఉన్న పన్ను 5 శాతానికి తగ్గిందన్నారు. ఈ సంస్కరణలతో జరుగుతున్న మేలుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గ్రామస్థాయి నుంచి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రులు, రైతు సేవా కేంద్రాలు, అంగన్వాడీలు, విద్యా సంస్థలు.. ఇలా ప్రతిచోటా అవగాహన కల్పిస్తున్నామన్నారు. జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో ఆదా అయిన సొమ్ము ప్రజల జీవితాలకు కొత్త దిశను చూపిస్తాయని, ఈ డబ్బు పెట్టుబడి కోసం, చదువుకోసం, డిపాజిట్ల కోసం.. ఇలా వివిధ రకాలుగా సద్వినియోగం చేసుకోవచ్చునన్నారు. కొత్త జీఎస్‌టీ సంస్కరణలతో రాష్ట్ర ప్రజలకు రూ. 8 వేల కోట్లు, జిల్లా ప్రజలకు దాదాపు రూ. 300 కోట్లు మేర ప్రయోజనం కలుగుతుందన్నారు. ఇంత మంచి అవగాహన కార్యక్రమంలో భాగస్వాములైన జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, ఆసుపత్రులు, డయాగ్నిస్టిక్ కేంద్రాలు.. ఇలా ప్రతిచోటా కొత్త జీఎస్‌టీ సంస్కరణలతో కలుగుతున్న ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జీవిత, ఆరోగ్య బీమాలకు సంబంధించి అధిక ప్రయోజనాలు సామాన్యులకు చేరువవుతున్నాయన్నారు. జీవిత బీమాలో తక్కువ ప్రీమియంతో ఎక్కువ కవరేజ్ లభిస్తుందని, ఆరోగ్య కుటుంబ బీమాలో ప్రతి రెన్యువల్‌లోనూ 18 శాతం ఆదా అవుతుందని వివరించారు. చికిత్సా ఖర్చులు, పరీక్షల ఖర్చులూ తగ్గుతాయని వెల్లడించారు.సాధారణ మందులపై పాత జీఎస్‌టీ 12 శాతం ఉంటే ఇప్పుడది 5 శాతానికి తగ్గిందని, టెస్టింగ్ కిట్లుపై పాత జీఎస్టీ 12 శాతం ఉంటే ఇప్పుడది 5 శాతానికి తగ్గిందన్నారు. వైద్య ఆరోగ్య రంగంతో పాటు వివిధ రంగాల్లో జీఎస్‌టీ సంస్కరణలతో కలుగుతున్న ప్రయోజనాలపై ప్రత్యేక ప్రచార కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

## గవాయ్‌పై దాడికి ముందే దళిత ఐపిఎస్ ఆత్మహత్య

న్యూఢిల్లీ,సిజెఐ గవాయ్‌పై జరిగిన దాడి మరువకముందే తాజాగా హర్యానా సీనియర్ దళిత ఐపిఎస్ అధికారి పురాన్ కుమార్ తనను తాను కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పురాన్ ఆత్మహత్యపై ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ తీవ్ర ఆవేదన చెందారు. కుల వేధింపుల వల్లే ఐపిఎస్ అధికారిని ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించాయని కేజ్రీవాల్ ఆరోపించారు. దోషులకు వీలైనంత త్వరగా కఠిన శిక్ష విధించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టులో చేశారు. ఈ సందర్భంగా ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్‌పై చెప్పు విసరబోయిన

# అసలు ఏమైంది..!

హైదరాబాద్,కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి కావల్సిన లక్షణాలు తనకు ఉన్నాయంటున్నారు సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే తూర్పు జయప్రకాష్ రెడ్డి అలియాస్ జగ్గారెడ్డి. అలాంటాయన తాజాగా నేడు రాజకీయాలకు దూరం అంటున్నారు. జగ్గారెడ్డి ఏది చేసినా ఏమి చెప్పినా సెన్సేషనల్ అవుతుంది. జగ్గారెడ్డి మాట మాట్లాడితే కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతర పార్టీలో సైతం రాజకీయ దుమారం లేగుస్తోంది. అలాంటి నేత నేడు రాజకీయాలకు దూరంగా ఉంటానని దసరా రోజు చేసిన కామెంట్స్ కాంగ్రెస్ పార్టీని కుదిపేస్తోందట. జగ్గారెడ్డికి సడన్‌గా అంత వైరగ్యం ఎందుకు?

తాను పదేళ్లలో సీఎం అవుతానని ప్రకటించిన జగ్గారెడ్డి

ఉమ్మడి మెదక్ జిల్లా సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి 2023 డిసెంబర్ జనరల్ ఎన్నికల్లో కాంగ్రెస్ కామన్ కార్యకర్త కూడా ముఖ్యమంత్రి కావచ్చని విచిత్రమైన స్టేట్‌మెంట్ ఇచ్చారు. రాష్ట్రానికి తాను కూడా ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు ఉన్నాయని, రానున్న 10 ఏళ్లలో ముఖ్యమంత్రి అవుతానంటూ ఆనాడు ఆయన చేసిన కామెంట్స్‌పై కాంగ్రెస్ పార్టీతో పాటు మిగతా పార్టీలో కూడా చర్చ జరిగింది. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులుకు కూడా జగ్గారెడ్డి చేసిన కామెంట్స్ అంతుచిక్కని ప్రశ్నగా మిగిలాయి. ఆ తర్వాత సంగారెడ్డిలో జగ్గారెడ్డి ఓటమిపాలయ్యారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన పరాజయం పాలైనప్పటికీ పార్టీ అధికారంలోకి రావడంతో యాక్టివ్‌గానే ఉంటూ వచ్చారు.

దసరా వేడుకల్లో జగ్గారెడ్డి సెన్షెషనల్ కామెంట్స్

ఓడిపోయిన నాటి నుంచి, ఎక్కడా కూడా వెనకడుగు వేయకుండా, కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలతో పాటు, పండుగలు పబ్బాలకు పేద ప్రజలకు అండగా ఉంటూ, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ వచ్చారు జగ్గారెడ్డి. అలాంటాయన దసరా వేడుకల్లో సెన్సేషనల్ కామెంట్ చేశారు. ఇకనుండి పది సంవత్సరాలు రాజకీయాలకు దూరంగా ఉంటానని, రానున్న ఎన్నికల్లో సంగారెడ్డి ఎమ్మెల్యేగా తన సతీమణి నిర్మల జగ్గారెడ్డిని పోటీలో దించుతానని ప్రకటించి, నియోజకవర్గ ప్రజలకు నిర్మలను పరిచయం చేశారు.

సంగారెడ్డికి చేయవలసిందంతా చేసిన జగ్గారెడ్డి

సంగారెడ్డి ప్రజలు తనకు మూడుసార్లుగా ఎమ్మెల్యే అవకాశం కల్పించారని, తాను వారికి చేయాల్సినంతా చేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని జగ్గారెడ్డి చెప్పుకొచ్చారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై వెనకడుగు వేయకుండా, వారికి ఏ ఆపద వచ్చినా, ఏ అవసరం ఉందన్నా అన్ని నెరవేర్చానన్నారు. ఆ క్రమంలో ఇకనుండి 10 సంవత్సరాలు ప్రత్యక్ష రాజకీయంగా దూరం ఉండాలని ఒక నిర్ణయానికి వచ్చానని, తన సతీమణి నిర్మలకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని కోరారు.

రాజకీయాల నుండి తప్పుకునే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారు?

రాష్ట్ర రాజకీయాల్లో వ్యూహాత్మకంగా వివరించే జగ్గారెడ్డి, రాజకీయాలకు దూరంగా ఉంటాననడంపై రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చే జరుగుతోంది. ఆయన ఎందుకు అలా అన్నారు.. రాజకీయాల నుండి తప్పుకునే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారనేది ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో అంతుపట్టకుండా తయారైంది. ముఖ్యమంత్రి స్థాయి నుంచి ఎమ్మెల్యే పదవి కూడా ఇప్పుడు తనకు అక్కర్లేదని, రానున్న ఎన్నికల్లో కూడా పోటీ చేయనని అంటున్నారు. అంటే జగ్గారెడ్డి మనసులో ఏం ఉందనేది రాజకీయ విశ్లేషకులకు కూడా అంతుచిక్కని ప్రశ్నగా ఉందట.

సమస్యల పరిష్కారానికి అధికారులతో సమీక్షలు..

సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన పథకాల అమలులో, నియోజకవర్గానికి కావలసిన నిధులు తెప్పించడంలోనే రాష్ట్రంలోనే ముందుండేవారన్న పేరుంది. ఎమ్మెల్యే గా ఆ ప్రాంత ప్రజలు ఓడించినా ప్రజలకు వెన్నంటి ఉంటూ, ఆపద సమయంలో ఆదుకుంటూ, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారు. అధికారులతో రివ్యూ సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేస్తూ, తాగునీటి సమస్యపై, మున్సిపాలిటీ అభివృద్ధి, నియోజకవర్గం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం డబుల్ బెడ్ రూముల ఫ్లాట్స్ కోసం అధికారులతో పాటు, జిల్లా కలెక్టర్ ఇతర శాఖ అధికారులతో సమన్వయంతో ముందుకు సాగుతూ వచ్చారు.

# రాజకీయ రాబందులు!

అమరావతి,ఈ నెల 3న అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం మండల కేంద్రమైన ములకలచెరువు పరిధిలో కల్తీ మద్యం తయారీ పరిశ్రమ బయటపడడంతో ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం ఉలిక్కిపడింది. మరీ ముఖ్యంగా మందుబాబులు తామింత కాలం తాగింది కల్తీ మద్యమేమో అనే అనుమానంతో ఆందోళనకు గురయ్యారు.అధికార అండతోనే కల్తీ మద్యం తయారీకి బరితెగించారని స్పష్టమైంది. ఈ ఎపిసోడ్‌లో తంబళ్లపల్లె టీడీపీ నాయకుడు కట్టా సురేంద్రనాయుడు, టీడీపీ ఇన్‌చార్జ్ దాసరిపల్లె జయంద్రారెడ్డి పీఏ రాజేష్ అరెస్ట్ కావడంతో కూటమి అధికారమే అరాచకానికి తెగబడేలా చేసిందనే నిర్ధారణకు జనం వచ్చారు. అంతేకాదు, తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డిని వెంటనే సస్పెండ్ చేసి టీడీపీ నష్టనివారణ చర్యలు చేపట్టింది.ఈ కేసులో అద్దేపల్లి జనార్దన్‌రావు అనే మద్యం వ్యాపారి మొదటి నిందితుడు. ఆఫ్రికా దేశాల్లో జనార్దన్‌రావు, టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి మద్యం వ్యాపారం చేస్తున్నట్టు బయటపడింది. రాజకీయంగా మారిన పరిస్థితుల్లో ఏం చేసినా, ఏం కాదనే ధైర్యమే కల్తీ మద్యం తయారీకి ఉసిగొల్పిందనడంలో ఎలాంటి సందేహం లేదు. ములకలచెరువుతో పాటు ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో కూడా కల్తీ మద్యం తయారీ పరిశ్రమ బయటపడడం ఆందోళన కలిగిస్తోంది.అయితే రాష్ట్ర ప్రజానీకం వేరే వుంది. ఈ రెండింటితోనే కల్తీ మద్యం తయారీకి పరిమితం కాలేదని, రాష్ట్ర వ్యాప్తంగా అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇదే దందా కొనసాగిస్తున్నారనే అనుమానం, ప్రచారం విస్తృతంగా సాగుతోంది. ఇది మందుబాబులను ఆందోళనకు గురి చేస్తోంది. ములకలచెరువు, ఇబ్రహీంపట్నంలలో కల్తీ పరిశ్రమ వ్యవహారాలు బయటపడడంతో మిగిలిన ప్రాంతాల్లో ఇదే దుర్మార్గ వ్యాపారాన్ని సాగిస్తున్న దొరలు అప్రమత్తం అయ్యారనే ప్రచారం జరుగుతోంది.దొరికితే దొంగ, దొరక్కపోతే దొర అనే సామెత చందానా%%% కల్తీ మద్యం తయారీ వ్యవహారం తయారైందనే చర్చకు తెరలేచింది. అధికారాన్ని సేవ కోసం కాకుండా "సేవ్" చేసుకోడానికే అని రాజకీయ నాయకులు విశ్వసిస్తున్న సమాజంలో బతుకుతున్నాం. స్వార్థం తన కుటుంబ ఆదాయం గురించి మాత్రమే ఆలోచింపజేస్తుంది. ఇతరుల యోగక్షేమాల గురించి ఆలోచించే వారైతే, కల్తీ మద్యం తయారీకి బరి తెగించే వాళ్లు కాదు.అయితే అదృష్టం కొద్దీ కల్తీ మద్యం తయారీలో నిపుణుల్ని వాడుకున్నారని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. అందుకే మందుబాబుల ప్రాణాలు పోలేదని ఎక్సైజ్ అధికారులు అంటున్నారు. నకిలీ మద్యం తయారీలో బాగా అనుభవం వుందనేందుకు ఇదే నిదర్శనమని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు.కల్తీ మద్యాన్ని తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల పరిధిలోని 70 దుకాణాలకు సరఫరా చేసినట్టు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. ఐదారు నెలలుగా నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్నట్టుగా ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వానికి చెడ్డపేరు తగ్గించేందుకే కొన్ని నిజాల్ని దాచి పెడుతున్నారనే ప్రచారం లేకపోలేదు.రాజకీయాలు, ప్రజలతో సంబంధం లేని వాళ్లను కేవలం డబ్బు వుందనే ఏకైక కారణంతో ఎన్నికల్లో పోటీ చేసేందుకు బరిలో దింపడం వల్లే దుర్మార్గాలకు తెరలేచిందనే విమర్శ వెల్లువెత్తుతోంది.

# హూజూరాబాద్ నాదే- నా వాళ్లే పోటీ చేస్తారు: ఈటల



హైదరాబాద్,ఈటల రాజేందర్ కు ప్రశాంత లేదు. హుజూరాబాద్ నియోజకవర్గానికి తానే లీడర్ అని..తన వాళ్లకే స్థానిక ఎన్నికల్లో నిలబెడతానని తాజా ప్రకటించారు. బీసీ రిజర్వేషన్ల జీవో కొట్టివేతపై స్పందించేందుకు ప్రెస్ మీట్ ఏర్పాటు చేసిన ఈటల రాజేందర్ హుజూరాబాద్ నియోజకవర్గంలో బీజేపీ తరపున పోటీ చేసే వారిని తానే ఎంపిక చేస్తానని ప్రకటించారు. తానే బీఫాంలు ఇస్తానని.. స్పష్టం చేశారు. ఆ నియోజకవర్గానికి తానే లీడర్‌నని ఆయన చెబుతున్నారు.నిజానికి ఇప్పుడు ఈటల రాజేందర్ మల్కాజిగిరి ఎంపీ . సాధారణ ఎన్నికల్లో హుజూరాబాద్ నుంచి ఓడిపోవడంతో ఆయన మల్కాజిగిరి ఎంపీగా టిక్కెట్ తెచ్చుకుని గెలిచారు. అప్పట్నుంచి హుజూరాబాద్ లో బండి సంజయ్ ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తున్నారు. హుజూరాబాద్‌తో ఈటలకు సంబంధం లేదని తన వర్గాన్ని పెంచుకుంటున్నారు. తనను నమ్ముకుని తనతో పాటు వచ్చిన క్యాడర్ మేలు చేయాలని.వారికి పార్టీ తరపున టిక్కెట్లు ఇప్పించాలని ఈటల అనుకుంటున్నారు. కానీ పరిస్థితి చేయి దాటుతూండటంతో నేరుగా ప్రెస్ మీట్ లో అసహనం వ్యక్తం చేశారు.మల్కాజిగిరిలో ఎంపీగా గెలిచినప్పటికీ తన అడ్డాగా ఈటల రాజేందర్ .. హుజూరాబాద్ నే నమ్ముతున్నారు. ఈ సారి అసెంబ్లీకి పోటీ చేసేది హుజూరాబాద్ నుంచేనని అంటున్నారు. కానీ ఆయనకు బీజేపీలో ప్రస్తుతం అంత తేలికైనా పరిస్థితులు కనిపించడం లేదు. బీజేపీ అధ్యక్ష పదవి ఇస్తారనుకుంటే ఇవ్వలేదు. ఇప్పుడు సొంత నియోజకవర్గంలో ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని పెంచడాన్ని ఆయన భరించలేకపోతున్నారు. తన అనుచరుల్ని కాపాడుకునేందుకు ధిక్కార స్వరం వినిపిస్తున్నారు.

# జూబ్లీహిల్స్ రాజకీయాల నుంచి విష్ణు ఔట్..



హైదరాబాద్,ఉప ఎన్నికతో జూబ్లీహిల్స్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. మూడు ప్రధాన పార్టీల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఇప్పటికే తమ అభ్యర్థులను ఎంపిక చేయగా, బీజేపీ నేడో రేపో తన అభ్యర్థి పేరు ఖరారు చేయనుంది. అయితే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గట్టిపట్టున్న మాజీ మంత్రి పీజేఆర్ కుటుంబం నుంచి ఎవరూ పోటీ చేయకపోవడం, చివరికి పీజేఆర్ కుటుంబ సభ్యుల పేర్లను పరిశీలనకు తీసుకోకపోవడంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. పీజేఆర్ కుమారుడు మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి బీఆర్ఎస్ లో ఉండగా, కుమార్తె విజయారెడ్డి కాంగ్రెస్ లో ఉన్నారు. ఈ ఇద్దరిని కనీసం పరిగణనలోకి తీసుకోకపోవడంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పీజేఆర్ కుటుంబం ప్రాబల్యం తగ్గిపోయిందా? అనే చర్చ మొదలైంది.2009 ముందు ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో జూబ్లీహిల్స్ ఉండేది. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో జూబ్లీహిల్స్ ఏర్పడింది. ఇప్పటికి నాలుగు సార్లు ఎన్నికలు జరిగితే ఒక సారి కాంగ్రెస్, ఒకసారి టీడీపీ, రెండు సార్లు బీఆర్ఎస్ గెలిచింది. అయితే కాంగ్రెస్ తరపున గెలిచిన విష్ణువర్ధన్ రెడ్డి ప్రస్తుతం రాజకీయంగా చురుకుగా వ్యవహరిస్తున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ దక్కకపోవడంతో బీఆర్ఎస్ లో చేరారు. 2009లో గెలిచిన విష్ణు 2014, 2018 ఎన్నికల్లో సైతం పోటీ చేశారు. కానీ ఓటమి చెందారు. ఈ నేపథ్యంలో గత ఎన్నికల్లో ఆయనకు పార్టీ టికెట్ నిరాకరించింది. దీంతో చివరి నిమిషంలో విష్ణు బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. ఎన్నికల్లో పోటీ చేయకపోయినా, పార్టీ ఓటమి పాలైనా గత రెండేళ్లుగా విష్ణు బీఆర్ఎస్ తరుపున చురుకుగా వ్యవహరిస్తున్నారు. కానీ, బీఆర్ఎస్ ఆయన పేరును కనీసం పరిశీలనకు తీసుకోలేదు. ఈ విషయమే ఇప్పుడు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని విష్ణు తండ్రి పీజేఆర్ అభిమానులను కలవరపెడుతోంది.నిజానికి జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో పీజేఆర్ ప్రాబల్యం ఇప్పటికీ కనిపిస్తుంది. ఆయన భౌతికంగా లేకపోయినా, పీజేఆర్ అభిమానులు ఆయన పేరిట పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేస్తుంటారు. దీంతో ఈ నియోజకవర్గంలో పీజేఆర్ కుటుంబానికి పెద్ద ఎత్తున మాస్ ఫాలోయింగ్ ఏర్పడింది. అయితే ఇది ఎన్నికల్లో గెలిపించేందుకు ఉపయోగపడకపోవడంతో పీజేఆర్ కుమారుడు వరుసగా మూడు సార్లు ఓడిపోవాల్సివచ్చిందని అంటున్నారు. పీజేఆర్ స్థాయిలో ప్రజల్లోకి చొచ్చుకువెళ్లలేకపోవడం వల్ల విష్ణు రాజకీయంగా వెనకబడిపోయారన్న విశ్లేషణలు ఉన్నాయి. అయితే గత ఎన్నికల్లో ప్రత్యామ్నాయం చూపుతామని బీఆర్ఎస్ విష్ణును పార్టీలోకి తీసుకుందని, కానీ ఇప్పుడు అవకాశం ఉన్నప్పటికీ విస్మరించారని, దీనికి కారణాలు ఏమైవుంటాయనే చర్చ ఎక్కువగా వినిపిస్తోంది.గత ఎన్నికల్లో పోటీకి విశ్వప్రయత్నం చేసిన విష్ణు కాంగ్రెస్ పార్టీ హ్యాండ్ ఇవ్వడంతో బీఆర్ఎస్ లోకి వెళ్లాల్సివచ్చిందని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. విష్ణు పార్టీ మార్పు వల్లే 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అజారుద్దీన్ గెలవలేకపోయారని అంటున్నారు. అయితే ఇప్పుడు టికెట్ దక్కించుకోలేని విష్ణు పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గెలుపు కోసం పనిచేస్తారా? లేదా? అన్నదే సస్పెన్స్ గా మారింది. ప్రస్తుతం సానుభూతి పేరుతో మాగంటి సునీతకు టికెట్ ఇచ్చారని, నెక్ట్స్ ఎన్నికలకు అభ్యర్థిని తానేనని విష్ణు తన సన్నిహితుల వద్ద చెబుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై బీఆర్ఎస్ పార్టీ హైకమాండ్ హామీ ఇచ్చిందీ లేనిదీ మాత్రం క్లారిటీ లేదని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# భారత్ నుంచి పాక్ కు తాలిబన్ మంత్రి స్ట్రాంగ్ వార్నింగ్!



న్యూఢిల్లీ,భారత్ లో తొలిసారిగా అఫ్గాన్ విదేశాంగ మంత్రి ముత్తాఖీ పర్యటిస్తున్నారు. ఈ సమయంలో పాకిస్థాన్ కు భారత్ నుంచి ముత్తాఖీ స్పష్టమైన సందేశాన్ని పంపించారు. ఇదే సమయంలో.. భారతదేశానికి హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా... ఆఫ్ఘన్ గడ్డను ఏ దేశానికి వ్యతిరేకంగా ఉపయోగించుకోవడానికి అనుమతించమని.. ఇది ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే పాక్ పై దాడిగా భావిస్తున్నామని తెలిపారు.అవును... దేశ రాజధాని ఢిల్లీలో అఫ్గానిస్థాన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాఖీతో భారత విదేశాంగ మంత్రి జై శంకర్ భేటీ అయ్యారు. అనంతరం మాట్లాడిన ముత్తాఖీ.. అఫ్గాన్ లో అమెరికా బలగాలు మోహరించిన సమయంలో కొన్ని ఒడిదుడుకులు ఎదుర్కొన్నామని.. అయితే, భారత్ కు వ్యతిరేకంగా ఎలాంటి ప్రకటనలు చేయలేదని అన్నారు.కాబూల్ లోని తెహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్తాన్ (టీటీపీ) శిబిరాలను లక్ష్యంగా చేసుకుని ఇస్లామాబాద్ సరిహద్దు దాడులను ప్రారంభించిన నేపథ్యంలో ఆఫాన్ నుంచి పాకిస్తాన్ కు ఈ కఠినమైన హెచ్చరిక రావడం గమనార్హం. ఈ నేపథ్యలోనే తమ భూభాగం నుంచి ఇతర దేశాలపై దాడులు నిర్వహించేందుకు ఏ దేశానికి కూడా అనుమతి ఇవ్వలేదని తెలిపారు.

భారత్ తమ క్లోజ్ ఫ్రెండ్!:

ఇదే సమయంలో... ఇటీవల అఫ్గానిస్థాన్ లో భూకంపం వచ్చినప్పుడు భారత్ అందించిన మానవతాసాయానికి కృతజ్ఞతలు తెలిపిన ఆ దేశ విదేశాంగ మంత్రి ముత్తాఖీ.. తాము ఆపదలో ఉన్నప్పుడు స్పందించిన తొలి దేశం భారత్ అని అన్నారు. ఈ నేపథ్యంలోనే... భారత్ ను తమ క్లోజ్ ఫ్రెండ్ గా భావిస్తున్నామని, ఇరు దేశాలు ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు.

ఆఫ్ఘాన్ తో ఆటలు మంచిది కాదు!:

ఇదే సమయంలో... సుదూర ప్రాంతాలలో సరిహద్దు దగ్గర దాడి జరిగిందని చెప్పిన ఆఫ్ఘాన్ మంత్రి.. పాకిస్తాన్ చర్యను తప్పుగా భావిస్తున్నామని తెలిపారు. 40 సంవత్సరాల తర్వాత ఆఫ్ఘనిస్తాన్ శాంతి, పురోగతిని సాధించింది. ఈ సమయంలో.. ఆఫ్ఘన్ల ధైర్యాన్ని పరీక్షించకూడదు.. ఆఫ్ఘనిస్తాన్ తో ఆటలు ఆడటం మంచిది కాదని ముత్తాకి అన్నారు.

ఆఫ్ఘాన్ కోసం భారత్ ఎప్పుడూ ముందుంటుంది!:

ఈ సందర్భంగా స్పందించిన జై శంకర్.... పహల్గాం ఉగ్రదాడి, కునార్-నంగర్గహర్ భూకంపం.. ఈ రెండు సందర్భాల్లో ఇరు దేశాలు చర్చలు జరిపేందుకు అవకాశం లభించిందని తెలిపారు. సమీప పొరుగు దేశంగా అఫ్గాన్ ప్రజల శ్రేయోభిలాషిగా.. అభివృద్ధి, పురోగతికి భారత్ ఎప్పుడూ ఆసక్తి చూపుతుందని.. అఫ్గాన్ లో భారత్ చేపట్టిన అనేక ప్రాజెక్టుల పునరుద్ధరణకు మార్గం సుగమమైందని అన్నారు.అదేవిధంగా... అటు కరోనా సమయంలోనూ, ఇటీవల భూకంపం సంభవించినప్పుడు ఆఫ్ఘాన్ కు అండగా నిలిచామని చెప్పిన జై శంకర్... అభివృద్ధి పట్ల ఇరు దేశాలకూ ఒకేరకమైన నిబద్ధత ఉన్నప్పటికీ.. రెండూ సీమాంతర ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్నాయని అన్నారు. కాబుల్ లో భారత ఎంబసీని తిరిగి ఓపెన్ చేయనున్నట్లు వెల్లడించారు.అయితే.. ఈ సమావేశం జరుగుతున్న సమయంలోనే కాబుల్ లో పాకిస్థాన్ వాయుసేన దాడులు జరపడం గమనార్హం.

# చెరువులో దూకి బిజెపి కార్యకర్త ఆత్మహత్య



యాదాద్రి భువనగిరి,యాదాద్రి జిల్లాలో ఓ బీజేపీ కార్యకర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బీబీనగర్ పెద్ద చెరువులో దూకి ఉప్పల్ కు చెందిన బీజేపీ కార్యకర్త రెవల్లి రాజు ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఈ ఆత్మహత్యకు గల కారణం అతను తన తల్లిని కొట్టడమే. కుటుంబంలో తలెత్తిన వివాదం కారణంగా రాజు తల్లిపై భౌతిక దాడికి పాల్పడ్డాడు. తన తల్లి కొట్టొద్దని వేడుకున్నా సరే విచక్షణ కోల్పోయి తల్లిని చెంప మీద కొట్టాడు. కాలితో తన్నాడు. అయితే ఈ సమయంలో అక్కడున్న వారు వారిస్తున్నా రాజు మాత్రం పట్టించుకోలేదు. ఈ తతాంగాన్నంతా వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో క్షణాల్లోనే వైరల్ గా మారింది. వీడియో వైరల్ కావడంతో తన పరువు పోయిందని.. తాను నలుగురిలో తల ఎత్తుకుని తిరగలేనంటూ మనోవేదనకు గురయ్యాడు. సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు బీజేపీ కార్యకర్త రాజు. ఆయన మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని భువనగిరి ఏరియా హాస్పిటల్ కు తరలించారు. ఉప్పల్ పోలీస్ స్టేషన్లో మృతుడి భార్య మహిమ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# పవన్,జగన్.. ఎవరి ఆలోచన కరెక్ట్?



అమరావతి,ఏదైనా చెబితే నమ్మేటట్టు ఉండాలి. ప్రజల్లో నమ్మకం కలిగించాలి. అప్పుడే ప్రజలు మనల్ని నమ్ముతారు. అయితే ఈ విషయంలో రాజకీయ పార్టీల నేతల వ్యవహార శైలి భిన్నంగా ఉంటుంది. కొందరు చేసిందే చెబుతారు.. చెప్పిందే చేస్తారు. మరికొందరు మాత్రం వాస్తవ పరిస్థితిని ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తారు. ఇటువంటి పరిస్థితి నిన్న ఏపీలో కనిపించింది. ఏకకాలంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మాజీ సీఎం జగన్ రాజకీయ పర్యటనలు చేశారు. కానీ ఇద్దరి మధ్య వైరుధ్యం స్పష్టంగా కనిపించింది. ఒకరు సమస్యపై పోరాటం చేయగా.. మరొకరు సమస్యకు పరిష్కార మార్గం చూపించారు. దానిపై స్పష్టతనిచ్చారు. దీంతో ఇద్దరు పర్యటనలపై ప్రజల్లో బలమైన చర్చ నడుస్తోంది. జగన్ నర్సీపట్నం టూర్కు వెళ్ళగా.. పవన్ ఉప్పాడ లో మత్స్యకారులను పరామర్శించేందుకు వెళ్లారు. కానీ ఇద్దరు ఒక్కోలా వ్యవహరించారు.

అలా ఎలా ప్రశ్నిస్తారు?

జగన్ అధికారంలో ఏదైనా శంకుస్థాపన చేస్తే.. గెలిచిన వెంటనే చేయాలని.. ఎన్నికలకు ముందు చేస్తే అది ప్రజలను మోసం చేయడమేనని చెప్పుకొచ్చారు. కానీ జగన్మోహన్ రెడ్డి తన పాలన మధ్యలో మెడికల్ కాలేజీలకు శంకుస్థాపన చేశారు. 2022 డిసెంబర్లో శంకుస్థాపన చేశారు. కానీ పనులు పూర్తి చేయలేకపోయారు. కూటమి అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటుతోంది. ప్రైవేటు భాగస్వామ్యంతో మెడికల్ కాలేజీల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిని తప్పు పడుతున్నారు జగన్మోహన్ రెడ్డి. కానీ అమరావతి రాజధాని నిర్మాణాన్ని ఐదేళ్లపాటు చిదిమేసిన విషయాన్ని మరిచిపోతున్నారు. దానిని మరిచి ఇప్పుడు ఎందుకు మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టడం లేదు అనే ప్రశ్నకు తాను అనర్హుడు నన్న విషయాన్ని గుర్తించలేకపోతున్నారు జగన్మోహన్ రెడ్డి.

100 రోజుల్లో సమస్యకు పరిష్కారం..

ఈ రాష్ట్రానికి డిప్యూటీ సీఎం గా ఉన్నారు పవన్ కళ్యాణ్. ఉప్పాడ లో కొద్ది రోజుల కిందట మత్స్యకారులు ఆందోళన చేశారు. రసాయనిక పరిశ్రమలు నుంచి వచ్చే వ్యర్థాలతో మత్స్య సంపద చచ్చిపోతోందని.. తమకు నష్టం కలుగుతోందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. వారిని నేరుగా కలుసుకున్నారు పవన్ కళ్యాణ్. సముద్రంలో వేటకు వెళ్లి చనిపోయిన మత్స్యకారులు 18 మంది కుటుంబాలకు 5 లక్షల రూపాయల చొప్పున.. 19 లక్షల రూపాయలు అందించారు. వారం రోజుల్లో రసాయనక పరిశ్రమల కాలుష్యంపై కమిటీ అధ్యయనం చేయాలని.. ప్రభుత్వానికి నివేదికలు పంపాలని ఆదేశించారు. 100 రోజుల్లో దీనికి ఒక పరిష్కార మార్గం చూపుతామని హామీ ఇచ్చారు. అయితే ఉప్పాడ తీరంలో ఇప్పుడే రసాయనిక పరిశ్రమలు ఏర్పాటు చేయలేదు. గత ప్రభుత్వంలోనే అవి ఏర్పాటయ్యాయి. కానీ ఇక్కడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మార్కు రాజకీయం చూపింది. దానికి తనదైన శైలిలో స్పందించారు పవన్ కళ్యాణ్. ఇలా ఇద్దరు నేతల రాజకీయ పర్యటనలు భిన్నంగా సాగడం విశేషం.

# నన్ను అంతమొందించే కుట్ర... బొత్స కీలక వ్యాఖ్యలు



విజయనగరం:విజయనగరం అమ్మవారి సంబరాలు సందర్భంగా చోటు చేసుకున్న ఘటనలను మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆక్షేపించారు. గ్రామ దేవత ఉత్సవాల సందర్భంగా తాను ఈ విషయం అప్పుడు మాట్లాడలేదని, పండగ ముగియడంతో ఈ విషయంపై మాట్లాడుతున్నానని చెప్పిన బొత్స జిల్లా అధికారులు, కూటమి నేతలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా తనను అంతం చేసే కుట్ర పన్నారని సంచలన ఆరోపణలు చేశారు. అంతేకాకుండా ప్రతిపక్ష నేతను అవమానించాలనే ఆలోచనే ఎక్కువగా కనిపించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.మండలిలో ప్రతిపక్ష నేతగా ఉన్న తనకు జిల్లా అధికారులు సమాధానం చెప్పాలని బొత్స డిమాండ్ చేశారు. అమ్మవారి ఉత్సవాలకు తాను వస్తున్నానని ముందుగా సమాచారం ఇస్తే కనీస ఏర్పాట్లు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిమాను సంబరం తిలకించేందుకు కేటాయించిన వేదిక కూలిపోయిందని, తమ పార్టీ ఎమ్మెల్సీ సురేశ్ బాబుతోపాటు మరికొందరికి గాయాలు అయ్యాయని బొత్స తెలిపారు. సిరిమాను ఉత్సవంలో అధికారులు ద్వంద్వ ప్రమాణాలు పాటించారని ధ్వజమెత్తారు బొత్స. అందరి కోసం కాకుండా ఏ ఒక్కరి కోసమో పండగ నిర్వహించారని బొత్స ఆగ్రహం వ్యక్తం చేవారు.ఇక ఆర్భాటం, అహంకారమే తప్ప సంప్రదాయాలకు పెద్దగా విలువ ఇవ్వలేదని విమర్శించారు. ప్రభుత్వ అధికారులు ఒక్కో ఆఫీసులో ఒక్కో హుండీ పెట్టి వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు. గతంలో ఇలాంటి సంప్రదాయం ఎక్కడైనా ఉందా? అంటూ ఆయన నిలదీశారు. పండగ ఏర్పాట్లలో అధికారుల నిర్లక్ష్యం పూర్తిగా కనిపించిందని మండిపడ్డారు. గతంలో పండగ విషయంలో నీతులు చెప్పిన గోవా గవర్నర్ ఎందుకు అభ్యంతరం చెప్పడం లేదని ప్రశ్నించారు."నాకు కేటాయించిన వేదిక కూలిపోయింది. నన్ను అవమానించాలనా, లేక అంతమొందించాలన్న కుట్రతో జరిగిందా అన్నది నాకు తెలియాలి" ప్రోటోకాల్ పాటించాలన్న బాధ్యత మీకు తెలియదా అంటూ బొత్స అధికారులను నిలదీశారు. దీని వెనుక ఎవరున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నానని, తనకు జరిగిన అవమానంపై గవర్నర్ కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.కాగా, విజయనగరం పండగ సందర్భంగా వైసీపీ కీలక నేత, మండలిలో ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న బొత్సకు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున షాక్ ఇచ్చారు. బొత్స గత 30 ఏళ్లుగా ఉత్సవాలు తిలకించేందుకు వాడుకుంటున్న డీసీసీబీ వేదికపైకి రాకుండా అడ్డుకున్నారు. ఇది తన సీనియార్టీని అవమానించడమేనని భావించిన బొత్స ఉత్సవాల ముందు నుంచి రగిలిపోతూనే ఉన్నారు. ఇక పండగ సందర్భంగా అధికార పార్టీ నేతలు హవా ప్రదర్శించడం, బొత్స మార్కు ఎక్కడా కనిపించకుండా చేయడంతో ఆయన మరింత ఆగ్రహానికి లోనరయ్యారని అంటున్నారు. ఈ కారణంగానే ఆయన ఎప్పుడూ లేనట్లు పండగ విషయంలో మీడియాతో మాట్లాడరని చెబుతున్నారు.

# జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాపై కేంద్రానికి 'సుప్రీం' కీలక ఆదేశాలు!



న్యూఢిల్లీ,జమ్మూ కశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరించాలంటూ దాఖలైన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర హోదా అంశంపై దాఖలైన పిటిషన్లపై స్పందన చెప్పాలంటూ కేంద్రానికి నాలుగు వారాల గడువు ఇచ్చింది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం పిటిషన్లను విచారించింది. విద్యావేత్త జహూర్ అహ్మద్ భట్, సామాజిక కార్యకర్త అహ్మద్ మాలిక్‌తో పాటు పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. 2023 డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు ఇచ్చిన హామీ మేరకు త్వరగా రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని పిటిషనర్లు కోరారు.ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పిటిషనర్ల తరఫు న్యాయవాదులు ఈ సందర్భంగా ప్రస్తావించారు. 2024 సెప్టెంబర్ 30 నాటికి జమ్మూ కశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించి, త్వరలో రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని పునరుద్ధరించాలని ఆ సమయంలో సుప్రీంకోర్టు ఆదేశించిందని గుర్తు చేశారు. జమ్మూ కశ్మీర్‌కు ముందస్తు రాష్ట్ర హోదా రాజ్యాంగపరమైన అవసరమని ఇర్ఫాన్ హాఫీజ్ పేర్కొన్నారు. జమ్మూ కశ్మీర్ రాష్ట్ర హోదా పిటిషన్‌లో వాది అయిన ఇర్ఫాన్ హాఫీజ్ లోన్.. సుప్రీంకోర్టు ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం గతంలో 2024 సెప్టెంబర్ నాటికి జమ్మూ కశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించాలని, త్వరలోనే రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని ఆదేశించిందని తెలిపారు.రాజ్యాం గంలోని సమాఖ్య స్ఫూర్తికి అనుగుణంగా రాష్ట్ర హోదాను నిర్దిష్ట కాలపరిమితితో పునరుద్ధరించాలని కోర్టుకు ఒక ప్రతిపాదనను సమర్పించారు. జమ్మూ కశ్మీర్ మంత్రివర్గం ఆమోదించిన ఈ ప్రతిపాదన కాపీని కోర్టుకు సమర్పించామని ఆయన తెలిపారు. కేంద్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ.. ఈ అంశంపై జమ్మూ కశ్మీర్ పరిపాలనతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇది ఒక ప్రత్యేక పరిస్థితి అని, ఇందులో అనేక సున్నితమైన అంశాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగా కేంద్రపాలిత ప్రాంతాన్ని ప్రతికూల కోణంలో చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు.

# చెదిరిన ట్రంప్ కల.. 8 యుద్ధాలు ఆపినా నోబెల్ రాలేదు..!



వాషింగ్టన్: ఈ ఏడాది నోబెల్ శాంతి పురస్కారం వెనిజుల ప్రతిపక్ష నాయకురాలు మరియా కొరినా మచాడోకు దక్కింది. దాంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నోబెల్ కల చదిరిపోయింది. ఈ క్రమంలో ఈ అవార్డుపై వైట్ హౌస్ స్పందించింది. డొనాల్డ్ ట్రంప్‌కు బదులుగా వెనిజులా ప్రతిపక్ష నాయకురాలికి శాంతి పురస్కారాన్ని ఇవ్వాలన్న నోబెల్ కమిటీ నిర్ణయాన్ని శ్వేత సౌధం విమర్శించింది.నోబెల్ బహుమతిని ఎంపిక చేసే ప్యానెల్ శాంతికి బదులుగా రాజకీయాలను ఎంచుకుందని పేర్కొంది. వైట్ హౌస్ ప్రతినిధి స్టీవెన్ చియుంగ్ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ శాంతి ఒప్పందాలకు మధ్యవర్తిత్వం చేస్తూ యుద్ధాలను అడ్డుకుంటూ ప్రాణాలను కాపాడుతూనే ఉంటారన్నారు. ఆయనకు మనవతావాది అని.. ఆయనలాంటి వారు తన దృఢ సంకల్పంతో పర్వతాలను సైతం కదిలించగలరన్నారు.ఇదిలా ఉండగా.. ఐరల్ లేడీగా పిలుచుకునే వెనిజుల ప్రతిపక్ష నాయకురాలు మరియా కొరినా మచాడో టైమ్ మ్యాగజైన్ 2025 వంద మంది అత్యంత ప్రభావవంతమైన వ్యక్తుల జాబితాలో చోటు దక్కించుకున్నారు. వెనిజులా ప్రజాస్వామ్య హక్కుల కోసం చేసిన పోరాటంలో ఆమె కృషికి శాంతి పురస్కారంతో మచాడోను సత్కరిస్తున్నట్లు నోబెల్ కమిటీ పేర్కొంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com